www.jananinadam.com

Follow :

జననినాదం

ప్రతి అక్షరం - సామాన్యుడి అయుధం

తెలుగు దినపత్రిక

శుక్రవారం 30 -10 - 2026

సంపుటి : 2 సంచిక : 172

ఆసిఫాబాద్ Asifabad

హైదరాబాద్ Hyderabad

ఎడిటర్ : జాధవ్ రోహిదాష్

Editor: JADAV ROHIDAS

పేజీలు : 06

వెల: రూ.2.00

Simultaneously published from
, Asifabad, Karimnagar, Adilabad ,
www.jananinadam.com



ఇజ్రాయెల్ ఎన్నికలను
అరబ్బులు దొంగిలించారు

నెతన్యాహు సంచలన ఆరోపణలు

- ఇజ్రాయెల్ ఎన్నికల్లో ఏ కూటమికీ దక్కని మెజారిటీ
- రికార్డు స్థాయిలో 19 సీట్లు గెలుచుకున్న అరబ్ పార్టీలు
- ప్రభుత్వ ఏర్పాటులో కింగ్‌మేకర్‌గా మారిన అరబ్ పక్షాలు
- ఓట్ల కొనుగోలు ఆరోపణలపై ముగ్గురి అరెస్ట్, విచారణ

ఢిల్లీ,: ఇజ్రాయెల్ సార్వత్రిక ఎన్నికల ఫలితాలు తీవ్ర ఉత్కంఠకు దారితీశాయి. ఏ కూటమికి ప్రభుత్వ ఏర్పాటుకు అవసరమైన స్పష్టమైన మెజారిటీ లభించకపోవడంతో రాజకీయ అనిశ్చితి నెలకొంది. ఈ నేపథ్యంలో ప్రధానమంత్రి బెంజమిన్ నెతన్యాహుకు చెందిన లికుడ్ పార్టీ సంచలన ఆరోపణలు చేసింది.

2వ పేజీలో...

నాగ్‌పూర్ ఎమ్మెల్సీ స్థానంలో
కాంగ్రెస్ విజయం

మహారాష్ట్రలో బీజేపీకి షాక్..

- సీఎం ఫడ్నవీస్ సొంత ప్రాంతంలో కాంగ్రెస్ విజయం!
- బీజేపీ అభ్యర్థిపై అభిజిత్ వంజారి 3,271 ఓట్ల ఆధిక్యంతో గెలుపు
- మహారాష్ట్రలో ఐదు స్థానాల్లో మహా వికాస్ అఘాడీకి మూడు సీట్లు
- రెండు స్థానాలకు పరిమితమైన అధికార మహాయుతి కూటమి

ముంబాయి: మహారాష్ట్ర ఎమ్మెల్సీ ఎన్నికల్లో నాగ్‌పూర్ ఫలితం బీజేపీకి గట్టి ఎదురుదెబ్బగా మారింది. ముఖ్యమంత్రి దేవేంద్ర ఫడ్నవీస్ సొంత ప్రాంతంలోనే కాంగ్రెస్ అభ్యర్థి విజయం సాధించడంతో రాజకీయంగా చర్చ మొదలైంది. ఫలితాలు పూర్తిగా వెలువడకముందే కాంగ్రెస్‌పై విమర్శలు చేసిన బీజేపీ నేతలకు ఈ గెలుపు సమాధానంగా మారింది. ప్రధాని మోదీ పోస్టును ప్రస్తావిస్తూ కాంగ్రెస్ నేతలు ఎదురుదాడికి దిగారు. రాష్ట్రంలో ఐదు స్థానాలకు జరిగిన ఎన్నికల్లో ప్రతిపక్ష మహా వికాస్ అఘాడీ మూడు స్థానాలను గెలుచుకుంది. అధికార మహాయుతి కూటమి రెండు స్థానాలకే పరిమితమైంది.

- ప్రజాస్వామ్యం, రాజ్యాంగాన్ని కాపాడేందుకే ఈ ఉద్యమం అని వెల్లడి
- ఇది ఏ ఒక్క పార్టీకి సంబంధించిన కార్యక్రమం కాదని స్పష్టం
- భయపడకుండా విద్యార్థులు తరలిరావాలని ప్రత్యేక విజ్ఞప్తి
- పోలీసులకు, లాఠీలకు భయపడొద్దని యువతకు ధైర్యం చెప్పిన రాహుల్




2వ పేజీలో...

రామ్‌లీలా మైదానానికి
తరలిరండి

విద్యార్థులకు రాహుల్ గాంధీ విజ్ఞప్తి

ఢిల్లీ,: కాంగ్రెస్ అగ్రనేత, ఎంపీ రాహుల్ గాంధీ దేశ ప్రజలకు కీలక పిలుపునిచ్చారు. నవంబర్ 1న న్యూఢిల్లీలోని రామ్‌లీలా మైదానంలో నిర్వహించనున్న 'చలో ఢిల్లీ రామ్‌లీలా మార్చ్'కు భారీ సంఖ్యలో తరలిరావాలని కోరారు. ఈ మేరకు ఆయన 'ఎక్స్' వేదికగా ఒక వీడియో సందేశాన్ని విడుదల చేశారు. దేశ ఆత్మను, ప్రజాస్వామ్యాన్ని, రాజ్యాంగాన్ని కాపాడేందుకే ఈ ఉద్యమమని, ఓట్ల దొంగతనాన్ని అడ్డుకోవాల్సిన సమయం ఆసన్నమైందని ఆయన పేర్కొన్నారు.



చర్చల కోసం ఇరాన్ కీలక అధికారికి
వాన్స్ లేఖ

ఢిల్లీ,: ఇరాన్‌తో శాంతి చర్చలు ప్రారంభించేందుకు అమెరికా ఉపాధ్యక్షుడు జేడీ వాన్స్ చొరవ తీసుకున్నారని వాల్ స్ట్రీట్ జర్నల్ వెల్లడించింది. ఇరాన్ సుప్రీం నేషనల్ సెక్యూరిటీ కౌన్సిల్ కార్యదర్శి, గతంలో ఇస్లామిక్ రివల్యూషనరీ గార్డ్ కార్ప్స్ (ఐఆర్‌జీసీ) కమాండర్‌గా పనిచేసిన మొహసెన్ రెజాయీకి వాన్స్ ఈ మేరకు లేఖ రాశారని ఆ పత్రిక తెలిపింది. చర్చలకు సంబంధించిన ఒప్పందానికి అమెరికా, ఇరాన్ అంగీకరించే అవకాశం ఉందా అనే విషయాన్ని తెలుసుకునేందుకు ఆయన ఆ లేఖ రాశారని పేర్కొంది. అమెరికా అధ్యక్షుడు డొనాల్డ్ ట్రంప్ ఆదేశాల మేరకే వాన్స్ ఆ లేఖ రాశారని, ఈ విషయం ట్రంప్‌కూ తెలుసని ఓ అధికారి చెప్పినట్లు వాల్ స్ట్రీట్ జర్నల్ పేర్కొంది. అయితే, ఇరాన్‌తో శాంతి చర్చలు ప్రారంభించాలని వాన్స్‌కు తాను ఎలాంటి ఆదేశాలు ఇవ్వలేదని ట్రంప్ స్పష్టం చేశారు.

2వ పేజీలో...

- బిల్లుల కోసం చావడానికి కూడా సిద్ధమేనన్న అనిరుధ్ రెడ్డి
- అనిరుధ్ వ్యాఖ్యలను తీవ్రంగా పరిగణిస్తున్నామన్న మహేశ్ గౌడ్
- నిధుల కొరత రాష్ట్రవ్యాప్తంగా ఉందన్న పీసీసీ చీఫ్



ఎమ్మెల్యే అనిరుధ్ రెడ్డి వ్యాఖ్యలపై
చర్యలు తప్పవు

హైదరాబాద్,: సొంత పార్టీ ఎమ్మె ల్యే అనిరుధ్ రెడ్డి చేసిన వ్యాఖ్యల పై టీపీసీసీ చీఫ్ మహేశ్ కుమార్ గౌడ్ ఆగ్రహం వ్యక్తం చేశారు. అనిరుధ్ వ్యాఖ్యలను తీవ్రంగా పరిగణిస్తున్నామని, ఈ వ్యవహా రాన్ని క్రమశిక్షణ కమిటీకి అప్పగి స్తామని ఆయన స్పష్టం చేశారు. అనిరుధ్ రెడ్డికి త్వరలోనే నోటీసు లు జారీ చేసే అవకాశం ఉందని సూచించారు. "జడ్చర్లలో నేను చస్తేనే బిల్లులు వస్తాయంటే...



2వ పేజీలో...

చంద్రబాబును మెచ్చుకున్న
కేటీఆర్

తెలంగాణ సర్కార్‌పై తీవ్ర విమర్శలు!

- కరవు పరిస్థితులను చంద్రబాబు గొప్పగా నిర్వహించారన్న కేటీఆర్
- అక్కడ లేని కరవు తెలంగాణలో ఎందుకుందని ప్రభుత్వంపై విమర్శ
- కొండా సురేఖ ఏం చెప్పారో పూర్తిగా చూడలేదని వెల్లడి

హైదరాబాద్,: ఏపీ ముఖ్యమంత్రి చంద్రబాబుపై బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్ అభినందనలు కురిపించారు. తెలంగాణలో కరవు పరిస్థితులపై స్పందిస్తూ, పొరుగు రాష్ట్ర ముఖ్యమంత్రిని ఆయన ప్రశంసించడం రాజకీయంగా ప్రాధాన్యత సంతరించుకుంది. తెలంగాణ కంటే ఏపీలో ఎక్కువ కరవు ఉన్నప్పటికీ, చంద్రబాబు పరిస్థితులను సమర్థవంతంగా నిర్వహించారని కేటీఆర్ అన్నారు. పక్క రాష్ట్రాలైన ఏపీ, కర్ణాటకలో లేని కరవు తెలంగాణలోనే ఎందుకు వచ్చిందని ప్రభుత్వాన్ని ప్రశ్నించారు. ఇది '30 శాతం కమీషన్ సర్కార్' అని రాజగోపాల్ రెడ్డి వ్యాఖ్యలు చేశారని కూడా తెలిపారు. ఇదే సమయంలో, గతంలో తనపై చేసిన వ్యాఖ్యలకు మాజీ మంత్రి కొండా సురేఖ క్షమాపణ చెప్పడంపై కేటీఆర్ స్పందించారు.



2వ పేజీలో...

ట్యాంక్‌బండ్‌పై బీజేపీ
మహా పాదయాత్ర లేదా?

అమిత్ షా రాకతో..

మారుతున్న ప్లాన్!

- నవంబర్ 2న హైదరాబాద్‌లో బీజేపీ మహా పాదయాత్ర
- అమిత్ షా ముఖ్య అతిథిగా హాజరు
- ట్యాంక్‌బండ్ మార్గంపై పునరాలోచన
- నాంపల్లి ఎగ్జిబిషన్ గ్రౌండ్ పరిశీలన
- పాదయాత్రతో పాటు భారీ సభకు యోచన

హైదరాబాద్: హైదరాబాద్‌లో నవంబర్ 2న నిర్వహించనున్న బీజేపీ మహా పాదయాత్రకు సంబంధించి పార్టీ కీలక మార్పుల దిశగా ఆలోచిస్తోంది. తొలుత ట్యాంక్‌బండ్ నుంచి పాదయాత్ర చేపట్టాలని భావించినప్పటికీ, కేంద్ర హోంమంత్రి అమిత్ షా హాజరవుతుండటంతో రూట్‌ను మార్చే యోచనలో ఉన్నట్లు సమాచారం. భద్రతా ఏర్పాట్లు, పరిపాలనాపరమైన అంశాలతో పాటు భారీగా కార్యకర్తలు తరలివచ్చే అవకాశం ఉండటంతో ప్రత్యామ్నాయ ప్రాంతాలను పరిశీలిస్తున్నట్లు తెలుస్తోంది.

నిన్న ఈనాడు, నేడు కొండా సురేఖ..!

హైదరాబాద్,: మాజీ మంత్రి కొండా సురేఖ బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్‌కు క్షమాపణలు చెప్పారు. కేటీఆర్‌పై గతంలో చేసిన వ్యక్తిగత దూషణల పట్ల విచారం వ్యక్తం చేస్తున్నానని, ప్రతిపక్షాన్ని విమర్శించే క్రమంలో ఆ విధంగా మాట్లాడానే తప్ప ఉద్దేశపూర్వకంగా కాదన్నారు. ఆనాడు నేను చేసిన కొన్ని నిరాధారమై న వ్యాఖ్యలు చేయకుండా ఉండాల్సి కాదని పశ్చాత్తాపాన్ని ప్రకటించారు.



2వ పేజీలో...

కేటీఆర్‌కు క్షమాపణలు చెప్పిన మాజీ మంత్రి

కమలంలో రాజకీయ కదలికలు..!

హైదరాబాద్, : తెలంగాణ బీజేపీలో ఒక్కసారిగా రాజకీయ కదలికలు పెరగడం చర్చనీయాంశంగా మారింది. కేంద్ర సహాయ మంత్రి బండి సంజయ్ కుమార్, ఎంపీ కొండా విశ్వేశ్వర్ రెడ్డి సహా కీలక నేతలు ఢిల్లీకి వెళ్లడం, కేంద్ర హోంమంత్రి అమిత్ షా, బీజేపీ జాతీయ అధ్యక్షుడు నితిన్ నబిన్‌లతో సమావేశం కానున్నారన్న సమాచారం రాజకీయ వర్గాల్లో ఆసక్తిని పెంచుతోంది. ఇంతకీ తెలంగాణ బీజేపీలో ఏం జరుగుతోంది? అధిష్టానం ఏదైనా కొత్త వ్యూహానికి పదును పెడుతోందా? రాష్ట్రంలో పార్టీ కార్యకలాపాలను మరింత విస్తృతం చేసేందుకు ఈ సమావేశం వేదిక కానుందా?ఒక రాష్ట్రానికి చెందిన కీలక నేతలను పార్టీ అధిష్టానం అత్యవసరంగా ఢిల్లీకి పిలవడం రాజకీయంగా ప్రాధాన్యం సంతరించుకుంటుంది.



2వ పేజీలో...

చర్చల కోసం ఇరాన్ కీలక అధికారికి వాన్స్ లేఖ

మొదటిపేజీ తరువాయి...

జాయింట్ బేస్ ఆండ్రూస్‌లో మీడియాతో ట్రంప్ మాట్లాడారు. ఇరాన్‌కు ప్రస్తుతం వైద్య సామగ్రి అవసరమని, అనారోగ్యంతో ఉన్నవారికి సాయం చేసేందుకు అవసరమైన సామగ్రి సరఫరా చేయడంపై వాన్స్ సంప్రదింపులు జరిపారని ఆయన పేర్కొన్నారు. కాగా.. రాబోయే వారాల్లో ఇరాన్‌పై మళ్లీ సైనిక దాడులు జరిపే అవకాశం ఉందని ట్రంప్ హెచ్చరించారు. ఈ నేపథ్యంలో దౌత్య చర్చల ద్వారా మరోసారి యుద్ధం జరగకుండా చూడాలని అమెరికా ప్రయత్నిస్తున్నట్లు తెలుస్తోంది. అయితే, ఇప్పటివరకూ శాంతి ఒప్పందానికి సంబంధించి స్పష్టమైన ప్రతిపాదన ఏదీ రాలేదు. మరోవైపు తమ ప్రధాన డిమాండ్లు నెరవేరే వరకూ అమెరికాతో చర్చలు జరిపే ప్రసక్తే లేదని రెజాయీ గత వారం స్పష్టం చేశారు.

నాగ్‌పూర్ ఎమ్మెల్సీ స్థానంలో కాంగ్రెస్ విజయం

మొదటిపేజీ తరువాయి...

నాగ్‌పూర్ పట్టభద్రుల నియోజకవర్గంలో కాంగ్రెస్ అభ్యర్థి అభిజిత్ వంజారి విజయం సాధించారు. బీజేపీ అభ్యర్థి సుధాకర్ కోహ్లేను 3,271 ఓట్ల తేడాతో ఓడించారు. ఓట్ల లెక్కింపు 40 గంటలకు పైగా సాగిన తర్వాత గురువారం ఫలితం వెలువడింది. బీజేపీకి సంప్రదాయంగా బలమైన స్థానంగా ఉన్న నాగ్‌పూర్‌లో కాంగ్రెస్ గెలవడం ప్రాధాన్యం సంతరించుకుంది. ఫడ్నవీస్‌తో పాటు కేంద్ర మంత్రి నితిన్ గడ్కరీ ప్రచారం చేసినా బీజేపీకి ఓటమి తప్పలేదు. ఎమ్మెల్సీ ఎన్నికల్లో కాంగ్రెస్‌కు ఒక్క సీటు కూడా దక్కలేదంటూ ప్రధాని నరేంద్ర మోదీ బుధవారం సామాజిక మాధ్యమాల్లో వ్యంగ్యంగా స్పందించారు. నాలుగు రాష్ట్రాల్లో 28 స్థానాలకు జరిగిన ఎన్నికల్లో కాంగ్రెస్ ఎన్ని సీట్లు గెలిచిందో ఊహించాలంటూ ప్రశ్నించారు. అయితే నాగ్‌పూర్ ఫలితం కాంగ్రెస్‌కు ఊరటనిచ్చింది. మోదీ వ్యాఖ్యలను ప్రస్తావిస్తూ బీజేపీపై విమర్శలు గుప్పించేందుకు కాంగ్రెస్‌కు అవకాశం లభించింది. ఫలితాలు పూర్తిగా రాకముందే కాంగ్రెస్ సున్నా సీట్లకే పరిమితమైందంటూ ఫడ్నవీస్ చేసిన పోస్టును ఆయన తొలగించారని మహారాష్ట్ర కాంగ్రెస్ విమర్శించింది. ఆయన పోస్టు స్క్రీన్‌షాట్‌ను సామాజిక మాధ్యమాల్లో పంచుకుంది. తొందరపడి చేసిన వ్యాఖ్యలు చివరకు ఇబ్బందికరంగా మారాయని ఎద్దేవా చేసింది. 2029లో మహారాష్ట్ర ప్రజలు మరింత గట్టి రాజకీయ షాక్ ఇస్తారని హెచ్చరించింది. నాగ్‌పూర్‌లో ఫడ్నవీస్ స్వయంగా ప్రచారం చేసినా బీజేపీ ఓడిపోవడాన్ని ఎన్సీపీ (శరద్ పవార్ వర్గం) ఎమ్మెల్యే రోహిత్ పవార్ ప్రస్తావించారు. బ్యాలెట్ పేపర్లతో ఎన్నికలు నిర్వహించడం వల్లే ఈ ఫలితం వచ్చిందంటూ వ్యంగ్యంగా వ్యాఖ్యానించారు. అయితే ఈవీఎంలపై ప్రతిపక్షాలు గతంలో చేసిన ఆరోపణలను బీజేపీ, ఎన్నికల సంఘం ఖండించాయి. మరోవైపు, తన పార్టీ అభ్యర్థి ఓటమిపై ఎన్సీపీ నేత ప్రఫుల్ పటేల్ స్పందించారు. పార్టీ ప్రాధాన్యాలు, సంస్థాగత నిర్మాణాన్ని వెంటనే సమీక్షించుకోవాల్సిన అవసరం ఉందన్నారు.

ట్యాంక్‌బండ్‌పై బీజేపీ మహా పాదయాత్ర లేదా?

మొదటిపేజీ తరువాయి...

అమిత్ షా పాల్గొనే ఈ కార్యక్రమానికి భారీగా జనసమీకరణ చేయాలని బీజేపీ భావిస్తోంది. పాదయాత్రతో పాటు చివర్లో భారీ బహిరంగ సభ నిర్వహించే ఆలోచనలోనూ ఉంది. ఈ నేపథ్యంలో సభకు అనువైన ప్రాంతంగా నాంపల్లిలోని ఎగ్జిబిషన్ గ్రౌండ్‌ను పార్టీ ముఖ్య నేతలు పరిశీలించినట్లు సమాచారం. ఓటర్ల జాబితాల ప్రత్యేక సమగ్ర సవరణ (సర్) ప్రక్రియపై కాంగ్రెస్, ఇండియా కూటమి చేస్తున్న విమర్శలను తిప్పికొట్టడమే లక్ష్యంగా బీజేపీ ఈ మహా పాదయాత్రను నిర్వహించనుంది. ఓటర్ల జాబితాల సవరణపై ప్రజల్లో అవగాహన కల్పించడంతో పాటు, విపక్షాల ఆరోపణలకు సమాధానం చెప్పాలని పార్టీ భావిస్తోంది. నవంబర్ 2న జరగనున్న ఈ కార్యక్రమానికి తెలంగాణ బీజేపీ అధ్యక్షుడు ఎన్. రాంచందర్ రావు నేతృత్వం వహించనున్నారు. అమిత్ షా రాకతో కార్యక్రమాన్ని మరింత భారీ స్థాయిలో నిర్వహించేందుకు పార్టీ ఏర్పాట్లు చేస్తోంది. అయితే పాదయాత్ర ఎక్కడి నుంచి ప్రారంభమవుతుంది? ఏ మార్గంలో సాగుతుంది? బహిరంగ సభ ఎక్కడ జరుగుతుంది? అనే అంశాలపై అధికారిక ప్రకటన రావాల్సి ఉంది.

చంద్రబాబును మెచ్చుకున్న కేటీఆర్

మొదటిపేజీ తరువాయి...



'నిజం నిలకడ మీద తేలుతుంది' అని వ్యాఖ్యానించారు. కొండా సురేఖ ఏం చెప్పారో ఇంకా పూర్తిగా చూడలేదని, ఆ వివరాలు చూశాక లీగల్ టీమ్‌తో చర్చించి తదుపరి చర్యలపై నిర్ణయం తీసుకుంటామని తెలిపారు. ఇటీవల ఒక పత్రిక కూడా క్షమాపణ చెప్పిందని గుర్తుచేశారు. ముమ్మందు తనపై ఫార్ములా-ఈ రేస్, విద్యుత్ కుంభకోణం వంటి తప్పుడు ఆరోపణలు చేసిన ప్రతి ఒక్కరూ పశ్చాత్తాపంతో క్షమాపణలు చెప్పక తప్పదని ఆయన అన్నారు. కాగా, అంతకుముందు మంత్రి కొండా సురేఖ ఎక్స్ వేదికగా కేటీఆర్‌కు బహిరంగ క్షమాపణలు చెప్పారు. అప్పటి రాజకీయ పరిస్థితుల్లో భాగంగా, ప్రతిపక్షాన్ని విమర్శించే క్రమంలోనే ఆ వ్యాఖ్యలు చేయాల్సి వచ్చిందని, కేటీఆర్‌ను వ్యక్తిగతంగా బాధపెట్టే ఉద్దేశం తనకు లేదని ఆమె స్పష్టం చేశారు.

కమలంలో రాజకీయ కదలికలు..!

మొదటిపేజీ తరువాయి...

ముఖ్యంగా రాష్ట్ర రాజకీయ పరిస్థితులు, పార్టీ సంస్థాగత బలోపేతం, ప్రజా సమస్యలపై పోరాటాల వంటి అంశాలు చర్చకు వచ్చే అవకాశం ఉన్నప్పుడు ఈ సమావేశంపై ఆసక్తి మరింత పెరుగుతుంది.బండి సంజయ్‌కు కేంద్ర ప్రభుత్వంలో బాధ్యతలు ఉండటంతోపాటు తెలంగాణ రాజకీయాల్లోనూ ఆయనకు ప్రత్యేక గుర్తింపు ఉంది. మరోవైపు కొండా విశ్వేశ్వర్ రెడ్డి ఎంపీగా రాష్ట్ర రాజకీయాల్లో కీలక పాత్ర పోషిస్తున్నారు. ఎన్వీ సుభాష్ వంటి పార్టీ ప్రతినిధులు కూడా ఈ చర్చల్లో పాల్గొనడం ద్వారా రాజకీయ అంశాలతోపాటు పార్టీ కార్యక్రమాలపై సమన్వయం జరిగే అవకాశం ఉంది.అయితే ఈ భేటీ వెనుక నిర్దిష్టంగా ఏ నిర్ణయం ఉందనే దానిపై అధికారిక ప్రకటన వెలువడే వరకు అంచనాలను వాస్తవాలుగా పరిగణించలేం. అయినప్పటికీ, రాష్ట్ర నేతలతో జాతీయ నాయకత్వం చర్చలు జరపడం ద్వారా తెలంగాణపై పార్టీ దృష్టి ఎలా ఉందో అర్థం చేసుకునే అవకాశం ఉంటుంది.తెలంగాణలో బీజేపీ తన రాజకీయ విస్తరణ కోసం కేవలం రాష్ట్రస్థాయి సమావేశాలకే పరిమితం కాకుండా, గ్రామస్థాయి నుంచి పార్టీని బలోపేతం చేయడంపై దృష్టి సారిస్తున్నట్లు గతంలో వెలువడిన నివేదికలు సూచిస్తున్నాయి. బూత్ కమిటీల బలోపేతం, జిల్లాల్లో పార్టీ కార్యకలాపాల విస్తరణ, స్థానిక నాయకులతో సమన్వయం వంటి అంశాలకు జాతీయ నాయకత్వం ప్రాధాన్యం ఇస్తోంది.ఈ వ్యూహం వెనుక ప్రధాన ఉద్దేశం రాబోయే స్థానిక సంస్థల ఎన్నికలతోపాటు భవిష్యత్తులో జరిగే అసెంబ్లీ ఎన్నికలకు పార్టీ యంత్రాంగాన్ని సిద్ధం చేయడంగా కనిపిస్తోంది. అయితే సంస్థాగతంగా పార్టీని విస్తరించడం ఒక అంశమైతే, ఆ బలాన్ని ఓట్ల రూపంలోకి మార్చుకోవడం మరో అంశం. అందుకు స్థానిక సమస్యలపై నిరంతరం స్పందించడం, ప్రజలతో సంబంధాలు పెంచుకోవడం కీలకం కానుంది.తెలంగాణలో అధికారంలో ఉన్న కాంగ్రెస్‌తోపాటు బీఆర్ఎస్‌ను కూడా రాజకీయంగా ఎదుర్కోవాలన్న వ్యూహంపై బీజేపీ నాయకత్వం గతంలో చర్చించినట్లు వార్తలు వచ్చాయి. రెండు పార్టీలపై విమర్శలు చేయడంతోపాటు, ప్రజా సమస్యలను తమ రాజకీయ కార్యాచరణలో భాగం చేసుకోవాలని రాష్ట్ర నాయకత్వానికి సూచించినట్లు నివేదికలు వెల్లడించాయి.విద్యార్థుల సమస్యలు, రైతుల ఇబ్బందులు, ఉద్యోగుల డిమాండ్లు, ప్రభుత్వ పథకాల అమలు వంటి అంశాలపై బీజేపీ ఎలాంటి కార్యాచరణ రూపొందిస్తుందనేది ఆసక్తికరంగా మారింది. నిరసనలు ప్రకటించడం ఒక్కటే సరిపోదు. ఆయా సమస్యలపై నిరంతర పోరాటం చేయడంతోపాటు, వాటికి పరిష్కారాలు చూపించే ప్రయత్నం కూడా పార్టీకి అవసరం.తెలంగాణ బీజేపీకి మరో ముఖ్యమైన అంశం అంతర్గత సమన్వయం. రాష్ట్రంలో పార్టీని విస్తరించాలంటే కీలక నాయకులంతా ఒకే దిశలో పనిచేయాల్సి ఉంటుంది. నాయకుల మధ్య విభేదాలు, వేర్వేరు వర్గాలుగా పనిచేస్తున్నారనే ప్రచారం పార్టీ కార్యకర్తల్లో గందరగోళానికి దారితీయవచ్చని గతంలో వచ్చిన నివేదికలు పేర్కొన్నాయి.ఈ నేపథ్యంలో బండి సంజయ్, కొండా విశ్వేశ్వర్ రెడ్డి వంటి నేతలతో ఢిల్లీలో జరిగే సమావేశం ప్రాధాన్యం సంతరించుకుంటోంది. రాష్ట్రంలోని వివిధ నాయకుల అభిప్రాయాలను సమన్వయం చేయడం, బాధ్యతలను స్పష్టంగా నిర్దేశించడం, పార్టీ కార్యక్రమాలకు ఒకే కార్యాచరణ రూపొందించడం వంటి అంశాలు చర్చకు వచ్చే అవకాశం ఉంది. అయితే ఈ సమావేశంలో అంతర్గత విభేదాలపై చర్చ జరుగుతుందా, కొత్త బాధ్యతలు



అప్పగిస్తారా అన్నది అధికారిక సమాచారం వెలువడితేనే స్పష్టమవుతుంది.తెలంగాణలో బీజేపీ తన రాజకీయ ప్రాధాన్యాన్ని పెంచుకోవాలంటే జాతీయ నాయకత్వం నుంచి వచ్చే ఆదేశాలతోపాటు రాష్ట్ర ప్రజల సమస్యలకు అనుగుణంగా కార్యాచరణ రూపొందించాల్సి ఉంటుంది. స్థానిక ఎన్నికల్లో పోటీ, బూత్ స్థాయి నిర్మాణం, ప్రజా ఉద్యమాలు, నాయకుల మధ్య సమన్వయం.. ఈ నాలుగు అంశాలు పార్టీ భవిష్యత్ రాజకీయ ప్రణాళికలో కీలకంగా మారే అవకాశం ఉంది.అందుకే ఇప్పుడు అందరి దృష్టి ఢిల్లీ సమావేశంపై ఉంది. ఈ భేటీ సాధారణ సమీక్షకే పరిమితమవుతుందా? లేక తెలంగాణ బీజేపీ రాజకీయ కార్యాచరణలో కొత్త మార్పులకు నాంది పలుకుతుందా? అనేది సమావేశం అనంతరం వెలువడే ప్రకటనలు, ఆ తర్వాత రాష్ట్రంలో పార్టీ చేపట్టే కార్యక్రమాలను బట్టి అర్థమవుతుంది.మొత్తానికి తెలంగాణ బీజేపీలో ఏదో జరుగుతోందన్న ఆసక్తి వెనుక ప్రధాన ప్రశ్న ఒక్కటే ? అధిష్టానం రూపొందించే వ్యూహాన్ని రాష్ట్ర నాయకత్వం క్షేత్రస్థాయిలో ఎంత సమర్థంగా అమలు చేస్తుంది? దానికి సమాధానం ఢిల్లీ భేటీ తర్వాత పార్టీ తీసుకునే నిర్ణయాల్లోనే కనిపించనుంది.

నిన్న ఈనాడు, నేడు కొండా సురేఖ..!

మొదటిపేజీ తరువాయి...

కేటీఆర్ లేదా ఆయన కుటుంబ సభ్యులను బాధపెట్టాలని గానీ, వారి ప్రతిష్టకు భంగం కలిగించాలనే దురుద్దేశం గానీ నాకు ఎంతమాత్రం లేదని స్పష్టం చేశారు. నా వ్యాఖ్యలు కేటీఆర్‌ను గానీ, వారి కుటుంబ సభ్యులను గానీ నొప్పించి ఉంటే అందుకు చింతిస్తూ ఆ వ్యాఖ్యలను ఉపసంహరించుకుంటున్నానంటూ మాజీ మంత్రి కొండా సురేఖ క్షమాపణలు చెప్పారు. కాగా, గతంలో అక్కినేని సమంత-నాగచైతన్య విడాకుల వ్యవహారంలో కేటీఆర్‌పై మాజీ మంత్రి కొండా సురేఖ నిరాధారమైన ఆరోపణలు చేసిన విషయం తెలిసిందే. ఈనాడు సైతం..!: మరోవైపు ఈనాడు దినపత్రిక సైతం ఇటీవలే కేటీఆర్‌కు క్షమాపణలు చెప్తూ పశ్చాత్తాపం వ్యక్తం చేసింది. కేటీఆర్ పాస్‌పోర్టును సీజ్ చేయాలని ఏసీబీ కోర్టు ఆదేశాలు ఇవ్వకపోయినప్పటికీ, ఇచ్చినట్టుగా ఈనాడు దినపత్రిక ఇటీవల తప్పుడు కథనం ప్రచురించింది. దీనిపై కేటీఆర్ లీగల్ నోటీసులు పంపించారు. దీంతో దిగొచ్చిన ఈనాడు యాజమాన్యం.. కేటీఆర్ పాస్‌పోర్టు వ్యవహారంలో తమ పత్రికలో తప్పుడు వార్తను ప్రచురించినట్టు అంగీకరించింది. ఇది ఉద్దేశపూర్వకంగా చేయలేదని, పొరపాటున తప్పు జరిగిందంటూ పశ్చాత్తాపం వ్యక్తంచేసింది. తప్పుడు వార్త ప్రచురించినందుకు క్షమాపణలు కోరింది. ఇక ఈ వ్యవహారాన్ని ముగించాలని కేటీఆర్ తరపు న్యాయవాదిని కోరింది.

కొత్తపల్లి, గుండుమల్‌లో కొత్త పోలీస్ స్టేషన్లు..

స్థలాలను పరిశీలించిన ఎస్పీ!

కొత్తపల్లి / గుండుమల్: ప్రజలకు పోలీస్ సేవలను మరింత చేరువ చేయడమే లక్ష్యంగా కొత్తపల్లి, గుండుమల్ మండలాల్లో నూతన పోలీస్ స్టేషన్ల ఏర్పాటుకు అధికారులు చర్యలు చేపట్టారు. ఇందులో భాగంగా జిల్లా ఎస్పీ వినీత్ గురువారం ఆయా మండలాల్లో పోలీస్ స్టేషన్ల నిర్మాణానికి అనువైన స్థలాలను పరిశీలించారు. ప్రజలకు మెరుగైన పోలీస్ సేవలు: పోలీస్ స్టేషన్ల ఏర్పాటుకు అనువైన స్థలాలు, భౌగోళిక పరిస్థితులు, ప్రజలకు అందుబాటులో ఉండే అంశాలను ఎస్పీ క్షేత్రస్థాయిలో పరిశీలించారు. నూతన పోలీస్ స్టేషన్ల ఏర్పాటుతో ఆయా మండలాల ప్రజలకు పోలీస్ సేవలు మరింత చేరువవుతాయని తెలిపారు. ఫిర్యాదులపై వేగంగా స్పందించడంతో పాటు నేరాల నియంత్రణ, ప్రజల భద్రత, శాంతిభద్రతల పరిరక్షణకు మరింత సమర్థవంతంగా చర్యలు తీసుకునే అవకాశం ఉంటుందని పేర్కొన్నారు. పోలీస్ వ్యవస్థను బలోపేతం చేసి ప్రజలకు మెరుగైన సేవలు అందించేందుకు అవసరమైన చర్యలు తీసుకుంటున్నట్లు ఎస్పీ వెల్లడించారు. ఈ కార్యక్రమంలో డీఎస్పీ నల్లపు లింగయ్య, సీఐ సైదులు, ఎస్సైలు విజయ్ కుమార్, చంద్రశేఖర్, ప్రజాప్రతినిధులు, సంబంధిత అధికారులు పాల్గొన్నారు.

ఎమ్మెల్యే అనిరుధ్ రెడ్డి వ్యాఖ్యలపై చర్యలు తప్పవు

మొదటిపేజీ తరువాయి...

నియోజకవర్గ అభివృద్ధి కోసం చనిపోవడానికైనా సిద్ధం" అని అనిరుధ్ రెడ్డి ఇటీవల తీవ్ర వ్యాఖ్యలు చేశారు. సొంత ప్రభుత్వాన్ని ఇరుకున పెట్టేలా ఉన్న ఈ వ్యాఖ్యలను పార్టీ అధిష్ఠానం సీరియస్‌గా తీసుకుంది. ఈ వ్యాఖ్యలపై మహేశ్ గౌడ్ స్పందిస్తూ... నిధుల కొరత ఒక్క జడ్చర్లలోనే కాకుండా రాష్ట్రవ్యాప్తంగా పలుచోట్ల ఉందని, ఇలా మాట్లాడటం సరికాదని హితవు పలికారు. ఈ అంశాన్ని పార్టీ క్రమశిక్షణ కమిటీ క్షుణ్ణంగా పరిశీలిస్తుందని తెలిపారు. నవంబర్ 1న ఢిల్లీలో జరిగే కాంగ్రెస్ ర్యాలీకి కార్యకర్తలను తరలించేందుకు ప్రత్యేక రైళ్ల కోసం దరఖాస్తు చేస్తే, దక్షిణ మధ్య రైల్వే సాకులు చెప్పి తిరస్కరిస్తోందని మహేశ్ గౌడ్ ఆగ్రహం వ్యక్తం చేశారు. రాహుల్ గాంధీ పేరు చెబితేనే బీజేపీ వణికిపోతోందని, ఎన్ని అడ్డంకులు సృష్టించినా తెలంగాణ నుంచి కార్యకర్తలను ఢిల్లీకి తీసుకెళ్లి తీరుతామని ఆయన ధీమా వ్యక్తం చేశారు.

ఇజ్రాయెల్ ఎన్నికలను అరబ్బులు దొంగిలించారు



మొదటిపేజీ తరువాయి...

అరబ్ నేతృత్వంలోని పార్టీలు లంచాలు, బెదిరింపులు, హింసకు పాల్పడి ఎన్నికలను దొంగిలించాయని తీవ్రంగా విమర్శించింది. బుధవారం నాటికి దాదాపు 90 శాతం ఓట్లు లెక్కించగా, 120 స్థానాలున్న ఇజ్రాయెల్ పార్లమెంట్ 'నెస్సెట్'లో నెతన్యాహు నేతృత్వంలోని మితవాద కూటమి 53 సీట్లకు పరిమితమైనట్లు తెలుస్తోంది. మాజీ సైన్యాధిపతి గాడి ఐసెన్‌కోట్ నేతృత్వంలోని విపక్ష కూటమి 48 స్థానాల్లో నిలిచింది. ప్రభుత్వ ఏర్పాటుకు 61 సీట్ల మ్యాజిక్ ఫిగర్ అవసరం కాగా, రెండు కూటములూ ఆ మార్కును అందుకోలేకపోయాయి.కింగ్‌మేకర్‌గా అరబ్ పార్టీలు: ఈ ఎన్నికల్లో అరబ్ నేతృత్వంలోని జాయింట్ లిస్ట్, రామ్ పార్టీలు చారిత్రక విజయాన్ని నమోదు చేశాయి. గతంతో పోలిస్తే దాదాపు రెట్టింపు స్థానాలు సాధించి, ఏకంగా 19 సీట్లను కైవసం చేసుకున్నాయి. దీంతో ప్రభుత్వ ఏర్పాటులో ఈ పార్టీలు కింగ్‌మేకర్‌గా అవతరించాయి. ఈ పరిణామంతోనే నెతన్యాహు వర్గం తీవ్ర ఆందోళనతో ఆరోపణలకు దిగింది. ఓటింగ్ శాతం కూడా గత 25 ఏళ్లలో ఎన్నడూ లేనంతగా 77 శాతానికి చేరడం గమనార్హం. "ఉగ్రవాదానికి, యూదు దేశ వినాశనానికి మద్దతిచ్చే అరబ్ పార్టీలు ఈ ఎన్నికలను దొంగిలించాయి" అని లికుడ్ పార్టీ ఒక ప్రకటనలో పేర్కొంది. ఓటర్లను ప్రలోభపెట్టడం, పోలింగ్ అధికారులను బెదిరించడం, నకిలీ ఓట్లు వేయడం వంటి అక్రమాలకు పాల్పడ్డారని ఆరోపించింది. దీనికి సంబంధించి వందలాది సాక్ష్యాలు, ఆధారాలను పోలీసులకు, సెంట్రల్ ఎలక్షన్స్ కమిటీకి సమర్పించినట్లు వెల్లడించింది. ఇప్పటికే రామ్ పార్టీకి ఓట్లు కొనుగోలు చేసేందుకు ప్రయత్నించారన్న ఆరోపణలపై ముగ్గురిని అరెస్ట్ చేసినట్లు పోలీసులు ధ్రువీకరించారు. వారి నుంచి నగదు, కవర్లు స్వాధీనం చేసుకున్నారు. అయితే, ఇది ఒకటీ అరా చోట్ల జరిగిన అసాధారణ ఘటన అని, దీనిపై విచారణ జరుగుతోందని ఎన్నికల కమిటీ తెలిపింది. పూర్తిస్థాయి అక్రమాల ఆరోపణలను కూడా సమీక్షిస్తున్నట్లు వెల్లడించింది. ప్రస్తుతానికి ఇరు కూటముల నేతలూ ప్రభుత్వ ఏర్పాటుకు ప్రయత్నిస్తామని చెబుతున్నారు. మరోసారి ఎన్నికలకు వెళ్లకుండా సంప్రదింపుల ద్వారా ప్రభుత్వాన్ని ఏర్పాటు చేయాలని అధ్యక్షుడు ఐజాక్ హెర్జోగ్ పార్టీలకు పిలుపునిచ్చారు. తుది ఫలితాలు వెలువడి, కొత్త ప్రభుత్వం ఏర్పడే వరకు నెతన్యాహు ఆపద్ధర్మ ప్రధానిగా కొనసాగుతారు.

రైతులను ఆదుకోవడంలో ప్రభుత్వం నిర్లక్ష్యం వీడాలి..: మాజీ మంత్రి



హన్వాడ: తెలంగాణలో రైతాంగం తీవ్ర సంక్షోభాన్ని ఎదుర్కొంటోందని, ఎండిన పంటలతో రైతులు అప్పుల ఊబిలో కూరుకుపోతున్నారని మాజీ మంత్రి వి. శ్రీనివాస్ గౌడ్ అన్నారు. మహబూబ్‌నగర్ జిల్లా హన్వాడ మండలం వేపూర్ గ్రామంలో గురువారం ఎండిన వరి పంటలను ఆయన పరిశీలించారు. రైతులతో మాట్లాడి పంట నష్టం, సాగు కోసం చేసిన అప్పులు, వారు ఎదుర్కొంటున్న ఇబ్బందులను తెలుసుకున్నారు. అనంతరం శ్రీనివాస్ గౌడ్ మాట్లాడుతూ రాష్ట్రంలో ఎక్కడ చూసినా రైతుల పరిస్థితి దయనీయంగా ఉందని ఆవేదన వ్యక్తం చేశారు. పంటలు ఎండిపోవడంతో పెట్టుబడుల కోసం చేసిన అప్పులు తీర్చలేక రైతులు ఇబ్బందులు పడుతున్నారని తెలిపారు. గ్రామీణ ప్రాంతాల్లో ఉపాధి లేక ప్రజలు తిరిగి వలస బాట పడుతున్నారని, చేతిలో తట్టా పారా పట్టుకొని ముంబై బస్సులు ఎక్కే పరిస్థితి ఏర్పడిందని అన్నారు. గతంలో మాదిరిగా పేదలకు గంజి కేంద్రాలు ఏర్పాటు చేయాల్సిన దుస్థితి వస్తుందేమోనని ఆందోళన వ్యక్తం చేశారు. ప్రభుత్వం రైతులను ఆదుకోవడంలో నిర్లక్ష్యం వహించకుండా వెంటనే చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు. అధికారులను క్షేత్రస్థాయిలో పంపించి ఎండిన పంటలను పరిశీలించి, నష్టాన్ని అంచనా వేయాలని కోరారు. పంట నష్టపోయిన రైతులకు ఎకరాకు రూ.25 వేల చొప్పున పరిహారం అందించాలని అన్నారు. రైతుబంధు నిధులను విడుదల చేయడంతో పాటు వ్యవసాయ కూలీలకు ఆర్థిక సహాయం అందించి, పేదలకు నిత్యావసర సరుకులు అందుబాటులో ఉంచాలని సూచించారు. మిగిలిన పంటలు కూడా ఎండిపోకుండా రైతులకు 24 గంటల విద్యుత్ సరఫరా చేయాలని కోరారు. పంటలు వేయవద్దని, విద్యుత్‌ను పొదుపుగా వినియోగించాలని సూచించడం మాత్రమే కాకుండా, రైతులకు ప్రత్యామ్నాయ మార్గాలను చూపించాలని అన్నారు. ఉమ్మడి మహబూబ్‌నగర్ జిల్లాలోని అన్ని మండలాలను కరువు మండలాలుగా ప్రకటించాలని డిమాండ్ చేశారు. రాబోయే రోజుల్లో తాగునీటి సమస్య తలెత్తకుండా ముందస్తు చర్యలు చేపట్టాలని సూచించారు. జిల్లా మంత్రి, ఎమ్మెల్యేలు క్షేత్రస్థాయిలో పర్యటించి రైతుల సమస్యలను స్వయంగా పరిశీలించి, వాస్తవ పరిస్థితులను ప్రభుత్వానికి వివరించాలని కోరారు. ఈ కార్యక్రమంలో హన్వాడ మాజీ ఎంపీపీ బాలరాజు, మాజీ జడ్పీటీసీ నరేందర్, హన్వాడ మండల బీఆర్ఎస్ అధ్యక్షుడు కరుణాకర్ గౌడ్, పీఏసీఎస్ చైర్మన్ కృష్ణయ్య గౌడ్, సీనియర్ నాయకులు బసిరెడ్డి, శ్రీనివాసులు, జంబులయ్య, చెన్నయ్య, ఖాజా గౌడ్, ఆనంద్, వెంకట్ రాములు తదితరులు పాల్గొన్నారు.

తెలంగాణలో మొదలైన నీటి కష్టాలు..

మంత్రి ఇలాఖాలో ఖాళీ బిందెలతో మహిళల నిరసన

హైదరాబాద్ : కాంగ్రెస్ పార్టీ తెచ్చిన కరువుతో రాష్ట్రంలో పల్లెలు, పట్నాలు చేక్క నీటి కోసం అల్లాడిపోతున్నాయి. వర్షాలు కురువక, కురిసిన చినుకులను ఒడిసిపట్టే తెలివిలేకపోవడంతో ప్రాజెక్టుల్లో ఉండాల్సిన నీరు సముద్రం పాలువుతున్నది. తాజాగా మంత్రి వివేక్ వెంకటస్వామి ఇలాఖాలో తాగునీటి కష్టాలపై మహిళలు ఆగ్రహం వ్యక్తం చేశారు. మంచిర్యాల జిల్లా చెన్నూరు మండలం ఎర్రగుంటపల్లి గ్రామంలో ఖాళీ బిందెలతో బోరుబావి వద్ద నిరసన తెలిపారు. తాగు నీటి సరఫరాను వెంటనే చేపట్టాలని డిమాండ్ చేశారు.

రామ్‌లీలా మైదానానికి తరలిరండి

మొదటిపేజీ తరువాయి...

ఈ కార్యక్రమం ఏ ఒక్క రాజకీయ పార్టీకి మాత్రమే పరిమితం కాదని రాహుల్ గాంధీ స్పష్టం చేశారు. ప్రధాని నరేంద్ర మోదీ, అమిత్ షా, ఎన్నికల కమిషన్ వైఖరితో విభేదించే ప్రతి ఒక్కరూ, ప్రజాస్వామ్యాన్ని కాంక్షించే పౌరులందరూ ఈ మార్చ్‌లో పాల్గొనాలని విజ్ఞప్తి చేశారు. ముఖ్యంగా విద్యార్థులను ఉద్దేశించి ఆయన ప్రత్యేకంగా మాట్లాడారు. "మీ భావ ప్రకటనా స్వేచ్ఛ, ఆలోచనలు, జీవన విధానంపై దాడి జరుగుతోందని మీరు భావిస్తే, ఏ రాజకీయ పార్టీతో సంబంధం లేకుండా ఈ మార్చ్‌కు తరలిరండి. పోలీసులకు, లాఠీలకు భయపడవద్దు. బీజేపీ ప్రభుత్వం అణచివేత చర్యలకు పాల్పడే సాహసం చేయదు" అని విద్యార్థులకు భరోసా ఇచ్చారు. దేశవ్యాప్తంగా వేలాది మంది ఈ కార్యక్రమంలో పాల్గొని, దీనిని విజయవంతం చేస్తారని ఆయన ఆశాభావం వ్యక్తం చేశారు.

విద్యాసంస్థలలో అభివృద్ధి పనులను త్వరగా పూర్తి చేయాలి

జిల్లా కలెక్టర్ కుమార్ దీపక్





జననినాదం,మంచిర్యాల ప్రతినిధి అక్టోబర్ 29: ప్రభుత్వ విద్యా సంస్థలలో చేపట్టిన అభివృద్ధి పనులను త్వరగా పూర్తిచేయాలని జిల్లా కలెక్టర్ కుమార్ దీపక్ అన్నారు. గురువారం కాసిపేట మండల కేంద్రంలోని కస్తూరిబా గాంధీ బాలికల విద్యాలయాన్ని సందర్శించి అదనపు గదుల నిర్మాణ పనులను పరిశీలించారు. ఈ సందర్భంగా జిల్లా కలెక్టర్ మాట్లాడుతూ పాఠశాలలలో చేపట్టిన అభివృద్ధి పనులను వేగవంతం చేసి త్వరగా పూర్తిచేయాలని అధికారులకు సూచించారు. వంటశాలను పరిశీలించి విద్యార్థులకు మెనూ ప్రకారం సకాలంలో పోషక విలువలు కలిగిన ఆహారాన్ని అందించాలని, ఆహారం తయారీలో తాజా కూరగాయలు, నాణ్యమైన నిత్యవసరాలను వినియోగించాలని తెలిపారు. జిల్లాలోని ప్రభుత్వ విద్యాసంస్థలలో కొనసాగుతున్న అభివృద్ధి పనులను త్వరితగతిన పూర్తి చేసి, విద్యార్థులకు మెరుగైన మౌలిక సదుపాయాలు కల్పించాలని సంబంధిత అధికారులను ఆదేశించారు. రేకులగూడలోని ప్రభుత్వ గిరిజన బాలుర ఆశ్రమ ఉన్నత పాఠశాలను మండల పంచాయతీ అధికారి సబ్దర్ అలీతో కలిసి సందర్శించి, పాఠశాలలోని సౌకర్యాలను పరిశీలించారు. తాండూర్ మండలంలోని తంగళ్లపల్లి గ్రామంలో గిరిజన సంక్షేమ శాఖ ఆధ్వర్యంలో నూతనంగా నిర్మిస్తున్న డి.ఎ. జుగా వసతి గృహ నిర్మాణ పనులను పరిశీలించి, నిర్మాణాన్ని త్వరగా పూర్తి చేయాలని అధికారులను ఆదేశించారు. పాఠశాలలో విద్యార్థుల సంఖ్యను పెంచేందుకు చర్యలు తీసుకోవాలని, విద్యార్థులందరూ క్రమం తప్పకుండా పాఠశాలకు హాజరయ్యేలా చూడాలని సూచించారు. మధ్యాహ్న భోజన పథకం అమలును పరిశీలించి, విద్యార్థులకు నాణ్యమైన భోజనం అందించాలని తెలిపారు. మండల కేంద్రంలోని కస్తూరిబా గాంధీ బాలికల విద్యాలయాన్ని సందర్శించి, నూతనంగా నిర్మిస్తున్న భోజనశాల పనులను పరిశీలించారు. వాటిని త్వరితగతిన పూర్తి చేయాలని ఆదేశించారు. వంటశాలను తనిఖీ చేసి, ప్రభుత్వం నిర్దేశించిన మెనూ ప్రకారం భోజనం అందించాలని సూచించారు. పాఠశాలలోని తరగతి గదులను పరిశీలించిన సందర్భంగా, విద్యార్థులకు సరైన విద్యా వాతావరణం కల్పించడంలో నిర్లక్ష్యం వహించినట్లు గుర్తించి, సంబంధిత స్పెషల్ ఆఫీసర్‌కు షోకాజ్ నోటీసు జారీ చేయాలని జిల్లా విద్యాశాఖ అధికారిని ఆదేశించారు. అనంతరం బెల్లంపల్లిలో చేపట్టిన యంగ్ ఇండియా ఇంటిగ్రేటెడ్ రెసిడెన్షియల్ స్కూల్ పనుల పురోగతిని పరిశీలించి, నిర్మాణ పనులు నాణ్యతా ప్రమాణాలకు అనుగుణంగా నిర్ణీత గడువులో పూర్తి చేయాలని సంబంధిత అధికారులకు సూచించారు. బెల్లంపల్లి సబ్ కలెక్టర్ కార్యాలయంలో సబ్ కలెక్టర్ మనోజ్ తో కలిసి నియోజకవర్గ పరిధిలోని తహసిల్దార్లతో సమావేశం నిర్వహించారు. భూభారతి, భూదాన్ భూములు, రెవెన్యూ సంబంధిత అంశాలు తదితర అంశాలపై సమీక్షించారు. పెండింగ్‌లో ఉన్న దరఖాస్తులు, రెవెన్యూ సమస్యలను నిబంధనల ప్రకారం త్వరితగతిన పరిష్కరించాలని, చేపట్టిన పనులను నిర్ణీత గడువులో పూర్తి చేయాలని అధికారులకు సూచించారు. ఈ కార్యక్రమంలో సంబంధిత అధికారులు తదితరులు పాల్గొన్నారు.

కోలం గిరిజనుల సంక్షేమానికి కృషి

ప్రభుత్వ పథకాలను సద్వినియోగం చేసుకోవాలి

డిప్యూటీ డైరెక్టర్ జాదవ్ అంబాజీ



జననినాదం,ఆసిఫాబాద్ 29: ఆదిమ గిరిజన కోలం ప్రజల సంక్షేమం, విద్యాభివృద్ధికి ప్రత్యేక చర్యలు తీసుకుంటామని గిరిజన సంక్షేమ శాఖ డిప్యూటీ డైరెక్టర్ జాదవ్ అంబాజీ తెలిపారు. ప్రభుత్వం అందిస్తున్న సంక్షేమ పథకాలను సద్వినియోగం చేసుకొని అభివృద్ధి చెందాలని సూచించారు. జిల్లా కేంద్రంలోని రవిచంద్ర కాలనీలో గురువారం ఆదిమ గిరిజన పోరాట యోధుడు కుమరం సూరు వర్ధంతిని నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన విగ్రహానికి ప్రత్యేక పూజలు చేసి నివాళులర్పించారు. అనంతరం కోలం ప్రజలు, నాయకులతో జాదవ్ అంబాజీ మాట్లాడారు. ఆదిమ గిరిజనుల హక్కుల పరిరక్షణ, అభివృద్ధి, సంక్షేమానికి ప్రభుత్వం అందిస్తున్న సహాయ సహకారాలను వినియోగించుకోవాలన్నారు. కోలం గిరిజనులకు విద్యాభివృద్ధి, సంక్షేమ పథకాల అమలులో శాఖ తరఫున అవసరమైన సహకారం అందిస్తామని పేర్కొన్నారు. ఆదిమ గిరిజన పోరాట యోధుల త్యాగాలు, సేవలను భావితరాలకు తెలియజేయాలని పలువురు నాయకులు అన్నారు. ఈ కార్యక్రమంలో స్థానిక సర్పంచ్ టెకం గంగారాం, కోలం సంఘం జిల్లా అధ్యక్షుడు ఆత్రం తిరుపతి, కుమరం సూరు మనవడు కుమరం పాండు, ఆత్రం భీంరావు, మాడావి శ్రీనివాస్, పెందూర్ సుధాకర్ తదితరులు పాల్గొన్నారు.

ఎన్ హెచ్ ఎం ఉద్యోగులను రెగ్యులరైజ్ చేయాలి

ఎమ్మెల్యే కోవా లక్ష్మి



జననినాదం,ఆసిఫాబాద్‌జిల్లా ప్రతినిధి అక్టోబర్ 29: తెలంగాణ రాష్ట్రంలో జాతీయ ఆరోగ్య మిషన్ పరిధిలో పనిచేస్తున్న సుమారు 17 వేల మంది ఔట్ సోర్సింగ్ ఉద్యోగులను రెగ్యులరైజ్ చేయాలని ఎమ్మెల్యే కోవా లక్ష్మి ప్రభుత్వాన్ని కోరారు. ఎన్నో ఏళ్లుగా ప్రజలకు వైద్య సేవలు అందిస్తున్న ఉద్యోగులకు ఉద్యోగ భద్రత కల్పించాలని అన్నారు. కరోనా వంటి క్లిష్ట పరిస్థితుల్లోనూ, గ్రామీణ, గిరిజన, మారుమూల ప్రాంతాల్లోనూ ఎన్ హెచ్ ఎం ఉద్యోగులు విశేష సేవలు అందించారని పేర్కొన్నారు. గర్భిణులు, చిన్నారుల ఆరోగ్య పరిరక్షణతో పాటు ప్రజారోగ్య కార్యక్రమాల్లో కీలక పాత్ర పోషిస్తున్న ఉద్యోగులకు ఉద్యోగ భద్రత లేకపోవడం బాధాకరమన్నారు. తక్కువ వేతనాలతో పనిచేస్తున్న ఉద్యోగులు కుటుంబ పోషణ, పిల్లల చదువులు, వైద్య ఖర్చుల కోసం ఇబ్బందులు పడుతున్నారని తెలిపారు.
రాష్ట్ర వ్యాప్తంగా ఎన్ హెచ్ ఎం ఉద్యోగుల సేవా కాలం, విద్యార్హతలు, అనుభవం, విధుల స్వభావంపై సమగ్ర సమీక్ష నిర్వహించాలని కోరారు. ఇతర రాష్ట్రాల్లో ఉద్యోగుల క్రమబద్ధీకరణ, ఉద్యోగ భద్రత కోసం అనుసరిస్తున్న విధానాలను అధ్యయనం చేసి, చట్టపరమైన నిబంధనలకు అనుగుణంగా అర్హులైన ఉద్యోగులను రెగ్యులరైజ్ చేసేందుకు చర్యలు తీసుకోవాలని సూచించారు. క్రమబద్ధీకరణ జరిగే వరకు ఉద్యోగులకు తగిన వేతనాలు, సమయానికి జీతాలు, ఇతర సేవా ప్రయోజనాలు కల్పించాలని డిమాండ్ చేశారు. ప్రభుత్వం, సంబంధిత శాఖల అధికారులు, ఉద్యోగ సంఘాల ప్రతినిధులతో సమావేశం నిర్వహించి సమస్యలను పరిష్కరించాలని కోరారు. సుమారు 17 వేల మంది ఎన్ హెచ్ ఎం ఉద్యోగుల భవిష్యత్తుకు భరోసా కల్పించేలా ప్రభుత్వం స్పష్టమైన ప్రకటన చేసి, రెగ్యులరైజేషన్ పై కార్యాచరణ ప్రణాళిక రూపొందించాలని డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో మున్సిపల్ చైర్మన్ ఆకాష్, వైస్ చైర్మన్ అహ్మద్, సింగిల్ విండో చైర్మన్ అలీ బిన్ హైమద్, నాయకులు రవీందర్, నిసార్, హైమద్, అన్సార్, గుండా శ్యామ్, సందీప్, ఖాసీం, పొన్నాల నారాయణ, శంకర్ తదితరులు పాల్గొన్నారు.



వెడ్మ రాము వర్ధంతి సభను విజయవంతం చేయాలి

సర్పంచ్ మడావి పార్వతి అంబరావు



జననినాదం,తిర్యాణి 29: ఆదివాసీ నాయకుడు కీర్తిశేషులు వెడ్మ రాము 39వ వర్ధంతి సభను విజయవంతం చేయాలని ఎదులపాడ్ సర్పంచ్ మడావి పార్వతి అంబరావు కోరారు. గురువారం గ్రామంలో వర్ధంతి సభకు సంబంధించిన పోస్టర్లను ఆవిష్కరించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ శుక్రవారం నిర్వహించనున్న సభకు ఆదివాసీ సంఘాల నాయకులు, గ్రామ పటేళ్లు, ప్రజాప్రతినిధులు, అధికారులు, యువత, మహిళా సంఘాల సభ్యులు, గ్రామస్థులు అధిక సంఖ్యలో హాజరై విజయవంతం చేయాలని విజ్ఞప్తి చేశారు. వర్ధంతి సభ నేపథ్యంలో ఎదులపాడ్ గ్రామంలో ఏర్పాట్లు చేపట్టారు. సభా ప్రాంగణంతో పాటు వెడ్మ రాము విగ్రహం వద్ద పరిసరాలను శుభ్రం చేశారు. గుంతలు ఉన్న ప్రాంతాల్లో మొరం పోసి చదును చేశారు. గంభీరావుపేట నుంచి ఎదులపాడ్ వరకు రహదారిపై గుంతలు ఉన్న చోట్ల మొరం పోశారు. ఈ కార్యక్రమంలో బీఆర్ఎస్ మాజీ ఎంపీటీసీ కొట్నాక యశ్వంత్‌రావు, గ్రామ పటేల్ మోతిరాం, వార్డు సభ్యులు వర్ణవతి, రామకృష్ణ, తిరుపతి, మధుకర్, చిరంజీవి, నెహ్రూ, అర్మా సోము, సంతోష్, నిర్వహణ కమిటీ అధ్యక్షుడు వెడ్మ తిరుపతి, కమిటీ సభ్యులు శంకర్, మెంగు, రాము, మారుతి, శ్రీనివాస్, చిక్రం జంగు, మడావి మధుకర్, రాజేందర్ తదితరులు పాల్గొన్నారు.

ప్రభుత్వ పథకాలను సద్వినియోగం చేసుకోవాలి

ఆదిలాబాద్ జిల్లా కేంద్ర సహకార బ్యాంకు మేనేజర్ వై. అనిల్‌కుమార్

గంబీరావుపేటలో ఆర్థిక సమ్మిళిత సాచురేషన్ క్యాంపెయిన్



జననినాదం,తిర్యాణి 29: అర్హులైన ప్రతి ఒక్కరూ కేంద్ర ప్రభుత్వ ఆర్థిక పథకాలను సద్వినియోగం చేసుకోవాలని ఆదిలాబాద్ జిల్లా కేంద్ర సహకార బ్యాంకు మేనేజర్ వై. అనిల్‌కుమార్ అన్నారు. మండలంలోని గంబీరావుపేట గ్రామపంచాయతీ కార్యాలయంలో గురువారం సర్పంచ్ జుమ్మిడి కిష్టయ్య అధ్యక్షతన, తిర్యాణి ప్రాథమిక వ్యవసాయ సహకార పరపతి సంఘం చైర్మన్ చుంచు శ్రీనివాస్ ఆధ్వర్యంలో ఆర్థిక సమ్మిళిత సాచురేషన్ క్యాంపెయిన్ నిర్వహించారు. ఈ సందర్భంగా అనిల్‌కుమార్ మాట్లాడుతూ కేంద్ర ప్రభుత్వ ఆర్థిక పథకాలు, బ్యాంకింగ్ సేవలు, బీమా సదుపాయాలపై ప్రజలకు అవగాహన కల్పించారు. ప్రధానమంత్రి జీవన్ జ్యోతి బీమా యోజన, ప్రధానమంత్రి సురక్షా బీమా యోజన పథకాల ప్రయోజనాలను వివరించారు. రైతు ఉత్పత్తిదారుల సంస్థ (ఎఫ్‌పీఓ) ద్వారా రైతులకు కలిగే లాభాలను తెలియజేశారు. బ్యాంకింగ్ సేవలను వినియోగించుకుంటూ ఆర్థిక భద్రతను పెంపొందించుకోవాలని పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో సహకార సంఘం సభ్యులు, బ్యాంకు సిబ్బంది, ప్రజాప్రతినిధులు, రైతులు, గ్రామస్థులు పాల్గొన్నారు.

క్షయ రహిత జిల్లాగా తీర్చిదిద్దాలి...

అర్హులైన గిరిజనులందరికీ ఇళ్లు మంజూరు... దేవాపూర్ (కోలాంగూడ)లో సమగ్ర ఆరోగ్య వైద్య శిబిరం..

జిల్లా కలెక్టర్ కె.హరిత



జననినాదం,ఆసిఫాబాద్‌జిల్లా ప్రతినిధి అక్టోబర్ 29: జిల్లాలో క్షయ వ్యాధిని పూర్తిగా నిర్మూలించేందుకు ప్రతి ఒక్కరూ సమష్టిగా కృషి చేయాలని జిల్లా కలెక్టర్ కె.హరిత పిలుపునిచ్చారు. క్షయ వ్యాధిని ప్రారంభ దశలోనే గుర్తించి, వైద్యుల సూచనల మేరకు ఆరు నెలల పాటు క్రమం తప్పకుండా మందులు వాడటంతో పాటు పోషకాహారం తీసుకుంటే వ్యాధి నుంచి కోలుకోవచ్చని తెలిపారు. గురువారం కెరమెరి మండలం దేవాపూర్ గ్రామపంచాయతీ పరిధిలోని కొలాంగూడ గ్రామంలో వైద్య ఆరోగ్య శాఖ ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన సమగ్ర ఆరోగ్య పరీక్షల శిబిరాన్ని జిల్లా వైద్య ఆరోగ్య శాఖ అధికారి నాగేంద్రతో కలిసి ఆమె ప్రారంభించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ క్షయ వ్యాధి లక్షణాలు ఉన్నవారు నిర్లక్ష్యం చేయకుండా వెంటనే నిర్ధారణ పరీక్షలు చేయించుకోవాలని సూచించారు. వ్యాధిని తొలిదశలో గుర్తించి చికిత్స తీసుకోకపోతే ఇతరులకు వ్యాపించే ప్రమాదం ఉందన్నారు. క్షయ వ్యాధి నిర్మూలనలో ప్రజలు భాగస్వాములు కావాలని, అధికారులు, వైద్య సిబ్బంది సమన్వయంతో పనిచేసి గిరిజన గ్రామాలను క్షయ రహిత గ్రామాలుగా తీర్చిదిద్దాలని పేర్కొన్నారు.



అర్హులందరికీ ఇళ్లు మంజూరు

ప్రధానమంత్రి జన్‌మన్ పథకం కింద అర్హులైనప్పటికీ చాలామందికి ఇళ్లు మంజూరు కాలేదని గ్రామస్థులు కలెక్టర్ దృష్టికి తీసుకువచ్చారు. దీనిపై ఆమె స్పందిస్తూ అర్హులైన ప్రతి ఒక్కరికీ నిబంధనల ప్రకారం ఇళ్లు మంజూరు చేస్తామని తెలిపారు. ప్రభుత్వం నిర్దేశించిన విస్తీర్ణంలో నాణ్యతా ప్రమాణాలను పాటిస్తూ ఇళ్ల నిర్మాణాలు చేపట్టాలని సూచించారు.
విద్యార్థులకు చాక్లెట్ల పంపిణీఅనంతరం గ్రామంలోని టీడబ్ల్యూఏస్ పాఠశాలను కలెక్టర్ సందర్శించారు. విద్యార్థుల హాజరు వివరాలను ఉపాధ్యాయులను అడిగి తెలుసుకున్నారు. చిన్నారులకు చాక్లెట్లు పంపిణీ చేశారు. అంతకుముందు క్షయ వ్యాధి నిర్మూలన ప్రచార వాహనాలకు జెండా ఊపి ప్రారంభించారు. ఈ కార్యక్రమంలో జిల్లా ప్రోగ్రాం అధికారి వినయ్‌కుమార్, కొలాంగూడ సర్పంచ్ కుమ్రం భీం రావు, ఉపసర్పంచ్ బారిక్ రావు, వైద్యులు, వైద్య ఆరోగ్య శాఖ సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

నిజాయతీ, పారదర్శకతతో వ్యవహరించాలి

మేరా యువ భారత్ ఉమ్మడి జిల్లా అధ్యక్షుడు షేక్ మజీద్

అవినీతికి వ్యతిరేకంగా ప్రతిజ్ఞ



జననినాదం,సిర్పూర్(యు)29: అవినీతికి తావులేకుండా ప్రతి ఒక్కరూ నిజాయతీ, పారదర్శకతతో వ్యవహరించాలని మేరా యువ భారత్ ఉమ్మడి జిల్లా అధ్యక్షుడు షేక్ మజీద్ అన్నారు. మినిస్ట్రీ ఆఫ్ యూత్ అఫైర్స్ అండ్ స్పోర్ట్స్ ఆధ్వర్యంలో గురువారం సిర్పూర్ (యు) మండల కేంద్రంలో అవినీతి వ్యతిరేక ప్రతిజ్ఞ కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా జీవితంలోని అన్ని రంగాల్లో నీతి, చట్టబద్ధ పాలనను పాటించాలని, లంచం ఇవ్వడం, తీసుకోవడం చేయకూడదని ప్రతిజ్ఞ చేశారు. ప్రతి పనిని నిజాయతీగా నిర్వహిస్తూ ప్రజా ప్రయోజనాలకు ప్రాధాన్యమివ్వాలని, అవినీతి ఘటనలను సంబంధిత అధికారుల దృష్టికి తీసుకెళ్లాలని ప్రతిజ్ఞ చేశారు. ఈ కార్యక్రమంలో మండల అధ్యక్షుడు కనక ఆనంద్, పటేల్ శ్రీరావు, ఉపసర్పంచ్ రామారావు, సామాజిక కార్యకర్త ఆరిఫ్, యువజన అధ్యక్షుడు ఆత్రం హనుమంతరావు, సుధాకర్, జుగాది రావు, బావురావు, దేవురావు, బల్లా తదితరులు పాల్గొన్నారు.

నేడు కళ్యాణలక్ష్మి చెక్కుల పంపిణీ



జననినాదం, తిర్యాణి 29: ఎంపీడీవో కార్యాలయంలో శుక్రవారం కళ్యాణలక్ష్మి చెక్కుల పంపిణీ కార్యక్రమం నిర్వహించనున్నట్లు తహసీల్దార్ శ్రీనివాస్ తెలిపారు. ఈ కార్యక్రమానికి ఎమ్మెల్యే కోవా లక్ష్మి హాజరై అర్హులైన లబ్ధిదారులకు చెక్కులు అందజేయనున్నట్లు పేర్కొన్నారు. లబ్ధిదారులు నిర్ణీత సమయానికి ఎంపీడీవో కార్యాలయానికి చేరుకోవాలని ఆయన సూచించారు.

ఇతర రాష్ట్రాల ధాన్యం జిల్లాలోకి
రాకుండా అంతర్రాష్ట్ర చెక్‌పోస్టు ఏర్పాటు

జిల్లా అదనపు కలెక్టర్ (రెవెన్యూ) వి.రాములు

జననినాదం,మంచిర్యాల ప్రతినిధి అక్టోబర్ 29: ఖరీఫ్ 2026--27 సీజన్‌లో ధాన్యం కనీస మద్దతు ధర కొనుగోళ్ల నేపథ్యంలో, ఇతర రాష్ట్రాల నుంచి ధాన్యం జిల్లాలోకి రాకుండా కట్టడి చేసేందుకు జిల్లాలోని కోటపల్లి మండలం రావనపల్లి గ్రామం సమీపంలోని లక్ష్మీపూర్ వద్ద అంతర్రాష్ట్ర చెక్‌పోస్టును ఏర్పాటు చేయాలని జిల్లా అదనపు కలెక్టర్ (రెవెన్యూ) వి.రాములు ఆదేశాలు జారీ చేశారు. మహారాష్ట్ర సరిహద్దులోని సిరొంచా ప్రాంతం నుంచి ఇతర రాష్ట్రాల ధాన్యం అక్రమంగా జిల్లాలోకి రాకుండా నిరంతర పర్యవేక్షణ చేపట్టాలని తెలిపారు. చెక్‌పోస్టు వద్ద రెవెన్యూ, పోలీస్, వ్యవసాయ శాఖల అధికారులకు బదిలీల వారీగా విధులు కేటాయించడం జరిగిందని, సంబంధిత అధికారులు సమన్వయంతో విధులు నిర్వహిస్తూ, చెక్‌పోస్టును క్రమం తప్పకుండా తనిఖీ చేయాలని ఆదేశించారు. అంతర్రాష్ట్ర చెక్‌పోస్టు వద్ద విధులు నిర్వహించే సిబ్బందిని జైపూర్ ఎ సి పి, జిల్లా వ్యవసాయ అధికారి, కోటపల్లి తహసిల్దార్ సమన్వయంతో పర్యవేక్షించాలని సూచించారు. రాజస్వ మండల అధికారి, జిల్లా పౌర సరఫరాల అధికారి, జిల్లా పౌర సరఫరాల సంస్థ మేనేజర్‌లు తరచూ ఆకస్మిక తనిఖీలు నిర్వహించాలని తెలిపారు. ఇతర రాష్ట్రాల నుంచి వచ్చే ధాన్యం వాహనాలను జిల్లాలోకి అనుమతించరాదని, ఆదేశాలను ఉల్లంఘించిన సిబ్బందిపై చర్యలు తీసుకుంటామని తెలిపారు. జిల్లాలోని పి ఎ సి ఎస్ కేంద్రాలకు ఇతర రాష్ట్రాల ధాన్యాన్ని తీసుకురాకుండా సంబంధిత అధికారులు పర్యవేక్షించాలని, ఇతర రాష్ట్రాల ధాన్యం గుర్తించిన పక్షంలో స్వాధీనం చేసుకొని, సంబంధిత రైతులకు ఎలాంటి చెల్లింపులు చేయరాదని తెలిపారు. ధాన్యం కొనుగోళ్లలో ప్రభుత్వ నిబంధనలు ఖచ్చితంగా అమలు చేస్తూ, స్థానిక రైతుల ప్రయోజనాలను కాపాడేందుకు అన్ని శాఖల అధికారులు సమన్వయంతో పని చేయాలని తెలిపారు.

ప్రైవేటు ఆసుపత్రుల సిబ్బందికి 8 గంటల
పనివిధానం అమలు చేయాలి

కార్మిక చట్టాలు అమలయ్యేలా చూడాలి

హెచ్ఎంఎస్ జిల్లా అధ్యక్షుడు నరెడ్ల శ్రీనివాస్

అసిస్టెంట్ లేబర్ కమిషనర్‌కు వినతిపత్రం అందజేత



జననినాదం, మంచిర్యాల 29: జిల్లాలోని ప్రైవేటు ఆసుపత్రుల్లో పనిచేస్తున్న కార్మికులు, ఉద్యోగులకు రోజుకు ఎనిమిది గంటల పనివిధానం అమలు చేయాలని హెచ్ఎంఎస్ జిల్లా అధ్యక్షుడు నరెడ్ల శ్రీనివాస్ డిమాండ్ చేశారు. అర్హులైన వారికి ఈఎస్ఐ, పీఎఫ్ సౌకర్యాలు కల్పించి, కనీస వేతన చట్టాన్ని అమలు చేయాలని కోరారు. ఈ మేరకు గురువారం అసిస్టెంట్ లేబర్ కమిషనర్‌కు వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్రైవేటు ఆసుపత్రుల్లో పనిచేస్తున్న పారిశుద్ధ్య కార్మికులు, వార్డుబాయ్స్, ఆయాలు, రిసెప్షనిస్టులు, ల్యాబ్, నర్సింగ్ సిబ్బంది, సెక్యూరిటీ గార్డులకు చట్టప్రకారం వేతనాలు చెల్లించాలన్నారు. నిర్ణీత పనిగంటలకు మించి పనిచేయిస్తే నిబంధనల ప్రకారం అదనపు వేతనాలు ఇవ్వాలని పేర్కొన్నారు. ఒకే విధమైన పనులు చేసే ఉద్యోగులకు సమాన వేతనం అందేలా చర్యలు తీసుకోవాలని కోరారు. జిల్లాలోని ప్రైవేటు ఆసుపత్రుల్లో కార్మిక శాఖ అధికారులు తనిఖీలు నిర్వహించి, పనిగంటలు, వేతనాలు, ఈఎస్ఐ, పీఎఫ్ సౌకర్యాల అమలును పరిశీలించాలని విజ్ఞప్తి చేశారు. కార్మిక చట్టాలను ఉల్లంఘించే యాజమాన్యాలపై విచారణ జరిపి చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు. కార్మికుల హక్కుల పరిరక్షణకు హెచ్ఎంఎస్ నిరంతరం పోరాడుతుందని స్పష్టం చేశారు. ఈ కార్యక్రమంలో హెచ్ఎంఎస్ మంచిర్యాల నగర అధ్యక్షుడు ఎండీ హుస్సేన్, జిల్లా ఉపాధ్యక్షుడు ఎండీ షఫీ, నగర ఉపాధ్యక్షుడు గుండ్ల లక్ష్మణ్, నగర నాయకుడు వల్లపు శ్రీను తదితరులు పాల్గొన్నారు.

గంజాయి సాగు, రవాణాపై ఉక్కుపాదం

అక్రమార్కులపై కఠిన చర్యలు తీసుకోవాలి

కలెక్టర్ కె. హరిత



జననినాదం,ఆసిఫాబాద్‌జిల్లా ప్రతినిధి అక్టోబర్ 29: జిల్లాలో గంజాయి సాగు, మాదకద్రవ్యాల రవాణాను అరికట్టేందుకు పకడ్బందీ చర్యలు తీసుకోవాలని కలెక్టర్ కె. హరిత అధికారులను ఆదేశించారు. సంబంధిత శాఖల అధికారులు సమన్వయంతో పనిచేస్తూ మాదకద్రవ్యాల కట్టడికి కృషి చేయాలని సూచించారు. గురువారం జిల్లా కేంద్రంలోని కలెక్టర్ కార్యాలయంలో ఏర్పాటు చేసిన సమావేశంలో ఆమె మాట్లాడారు.

గంజాయి సాగు, రవాణాకు పాల్పడే వారిని గుర్తించి కఠిన చర్యలు తీసుకోవాలన్నారు. ప్రభుత్వ పాఠశాలలు, కళాశాలలు, సంక్షేమ వసతిగృహాల్లో విద్యార్థులకు మాదకద్రవ్యాల వినియోగంతో కలిగే అనర్థాలపై అవగాహన కల్పించాలని సూచించారు. హోటళ్లు, దాబాల్లో తనిఖీలు నిర్వహించాలని, మందుల దుకాణాల్లో నిషేధిత, అధిక మోతాదు ఔషధాల విక్రయాలపై నిఘా పెట్టాలని ఆదేశించారు. వైద్యారోగ్యశాఖ ఆధ్వర్యంలో గ్రామాల్లో అవగాహన కార్యక్రమాలు చేపట్టాలన్నారు. నషా ముక్త్ భారత్ అభియాన్‌లో భాగంగా పాఠశాలలు, కళాశాలల్లో అవగాహన సదస్సులు నిర్వహించి, వాటిని పొగాకు రహిత విద్యాసంస్థలుగా తీర్చిదిద్దాలని పేర్కొన్నారు.

ఈ నెలలో 16 కేసులు నమోదు...

ఈ నెలలో గంజాయి సాగు, రవాణాపై తనిఖీలు నిర్వహించి 16 కేసులు నమోదు చేసినట్లు జిల్లా ఎస్పీ నితికాపంత్ తెలిపారు. గంజాయి సాగుకు పాల్పడే వారికి ప్రభుత్వ సంక్షేమ పథకాలు వర్తించకుండా చర్యలు తీసుకుంటున్నట్లు వెల్లడించారు. గంజాయి సాగు, రవాణా, మాదకద్రవ్యాల అక్రమ రవాణా, వినియోగంపై నిఘా పెంచి కఠిన చర్యలు తీసుకుంటామని స్పష్టం చేశారు.సమావేశంలో జిల్లా అదనపు కలెక్టర్ (స్థానిక సంస్థలు) యువరాజ్ మర్మాట్, కాగజ్‌నగర్ సబ్ కలెక్టర్ హర్ష చౌదరి, ఆర్డీవో లోకేశ్వర్‌రావు, డీఎస్పీ అశోక్, జిల్లా పంచాయతీ అధికారి భిక్షపతి, జిల్లా గిరిజన అభివృద్ధి అధికారి అంబాజీ, జిల్లా వైద్యారోగ్యశాఖ అధికారి నాగేంద్ర, జిల్లా మాధ్యమిక విద్యాధికారి కళ్యాణి, ఇతర శాఖల అధికారులు పాల్గొన్నారు.

భూమి విరాసత్ కు లంచం ఏసీబీకి చిక్కిన జీపీఓ శ్రీనివాస్

రూ.22 వేల లంచం తీసుకుంటూ జీపీఓ పట్టివేత



ఆసిఫాబాద్ జిల్లా కాగజ్‌నగర్ తహసీల్దార్ కార్యాలయంలో గురువారం ఏసీబీ అధికారులు దాడులు నిర్వహించి, రూ. 22 వేల లంచం తీసుకుంటున్న మోసం గ్రామ పంచాయతీ జీపీఓ బి. శ్రీనివాస్‌ను రెడ్ హ్యాండెడ్ గా పట్టుకున్నారు. రైతు భూమి విరాసత్ కోసం తొలుత రూ. 50 వేలు

ప్రభుత్వ భూముల క్రమబద్ధీకరణను
నిబంధనల ప్రకారం సమర్థవంతంగా చేపట్టాలి

జిల్లా కలెక్టర్ కుమార్ దీపక్





జననినాదం,మంచిర్యాల ప్రతినిధి అక్టోబర్ 29: ప్రభుత్వ భూముల క్రమబద్ధీకరణను నిబంధనల ప్రకారం సమర్థవంతంగా చేపట్టాలని జిల్లా కలెక్టర్ కుమార్ దీపక్ అన్నారు. గురువారం జిల్లాలోని నస్పూర్ లో గల సమీకృత జిల్లా కార్యాలయాల భవన సముదాయంలోని కలెక్టర్ ఛాంబర్ లో జి.ఓ. నం. 59, 76 అమలుపై జిల్లా అటవీ అధికారి రాహుల్ కిషన్ జాదవ్, జిల్లా అదనపు కలెక్టర్ (స్థానిక సంస్థలు) పి.చంద్రయ్య, జిల్లా అదనపు కలెక్టర్ (రెవెన్యూ) వి. రాములు, బెల్లంపల్లి సబ్ కలెక్టర్ మనోజ్ లతో కలిసి సంబంధిత జిల్లా అధికారులతో సమీక్ష సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా జిల్లా కలెక్టర్ మాట్లాడుతూ ప్రభుత్వ, సింగరేణి భూముల క్రమబద్ధీకరణకు సంబంధించి ప్రత్యేక బృందాలను ఏర్పాటు చేయడం జరిగిందని, ప్రభుత్వ ఉత్తర్వులలో పేర్కొన్న నిబంధనలు, అర్హతలు, నిర్దేశిత గడువులకు అనుగుణంగా ప్రక్రియను చేపట్టాలని సూచించారు. నిర్దేశిత కటాఫ్ తేదీకి ముందుగా జరిగిన ఆక్రమణలకు మాత్రమే, సంబంధిత జి.ఓ. నిబంధనల ప్రకారం అర్హత ఉన్న సందర్భాలలో క్రమబద్ధీకరణ చేపట్టాలని తెలిపారు. భూముల క్రమబద్ధీకరణకు ముందు సంబంధిత భూమి అటవీ భూముల పరిధిలోకి వస్తుందా/లేదా అనే విషయాన్ని క్షేత్రస్థాయిలో క్షుణ్ణంగా పరిశీలించాలని, అటవీ భూములకు సంబంధించిన చట్టాలు, నిబంధనలను తప్పనిసరిగా పాటించాలని, అన్ని అంశాలను నిర్ధారించిన అనంతరమే నిబంధనల ప్రకారం తదుపరి చర్యలు చేపట్టాలని తెలిపారు. జి.ఓ. నం. 59 ప్రకారం 500 చదరపు గజాల లోపు విస్తీర్ణంలో ఉన్న ఆక్రమణల క్రమబద్ధీకరణకు సంబంధించి నిర్దేశించిన నిబంధనలు, అర్హతలను పరిశీలించి చర్యలు తీసుకోవాలని సూచించారు. జి.ఓ. నం. 76కు సంబంధించి తహసిల్దార్లు, సింగరేణి అధికారుల సమన్వయంతో క్రమబద్ధీకరణ ప్రక్రియను కొనసాగించాలని, సింగరేణి ఉద్యోగులు కాని వారు సింగరేణి క్వార్టర్లలో నివాసం ఉంటున్నట్లయితే, నిబంధనల ప్రకారం వాటిని ఖాళీ చేయించేందుకు చర్యలు తీసుకోవాలని తెలిపారు. సింగరేణి నిర్మాణాలలో నివాసం ఉంటున్న వారికి సంబంధిత మున్సిపాలిటీల ద్వారా ఆస్తి పన్ను విధించడం, ఇంటి నంబర్లు కేటాయించడం వంటి అంశాలను పరిశీలించి, నిబంధనలకు విరుద్ధంగా ఇలాంటి చర్యలు జరిగినట్లు గుర్తిస్తే, సంబంధిత మున్సిపల్ అధికారులపై తగిన చర్యలు తీసుకోవాలని ఆదేశించారు. భూముల క్రమబద్ధీకరణలో పారదర్శకత పాటిస్తూ, ప్రభుత్వ భూముల పరిరక్షణకు ప్రాధాన్యత ఇవ్వాలని తెలిపారు.ఈ కార్యక్రమంలో సంబంధిత జిల్లా అధికారులు, సింగరేణి అధికారులు, తహసిల్దార్లు, సంబంధిత అధికారులు తదితరులు పాల్గొన్నారు.

రహదారి ప్రమాదాల నివారణకు చర్యలు తీసుకోవాలి...

తరుచు ప్రమాదాలు జరిగే ప్రాంతాలను గుర్తించాలి..

జిల్లా కలెక్టర్ కె.హరిత





జననినాదం,ఆసిఫాబాద్‌జిల్లా ప్రతినిధి అక్టోబర్ 29: జిల్లాలో రహదారి ప్రమాదాల నివారణకు పటిష్ఠ చర్యలు తీసుకోవాలని కలెక్టర్ కె. హరిత అధికారులను ఆదేశించారు. గురువారం జిల్లా కేంద్రంలోని కలెక్టర్ కార్యాలయంలో సమావేశ మందిరంలో ఏర్పాటు చేసిన జిల్లా రహదారి భద్రత కమిటీ సమావేశంలో ఎస్పీ నితికా పంత్, అదనపు కలెక్టర్ (స్థానిక సంస్థలు) యువరాజ్ మర్మాట్, కాగజ్‌నగర్ సబ్ కలెక్టర్ హర్ష చౌదరితో కలిసి ఆమె పాల్గొన్నారు.ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ.. జాతీయ రహదారిపై తరచూ ప్రమాదాలు జరిగే ప్రాంతాలను గుర్తించి, నివారణ చర్యలు చేపట్టాలన్నారు. ప్రమాదం జరిగిన వెంటనే క్షతగాత్రులను ఆసుపత్రులకు తరలించాలని సూచించారు. ప్రధానమంత్రి రహత్ పథకం కింద అర్హులకు ఉచిత చికిత్స అందించే అవకాశం ఉందని తెలిపారు. వాహనదారులు తప్పనిసరిగా హెల్మెట్, సీటు బెల్టు ధరించాలని, మద్యం సేవించి వాహనాలు నడపకుండా అధికారులు చర్యలు తీసుకోవాలన్నారు. రోడ్లు, భవనాలు, పంచాయతీరాజ్ శాఖల పరిధిలోని రహదారులపై గుంతలను వెంటనే పూడ్చాలని ఆదేశించారు. మూలమలుపుల వద్ద ప్రమాదాలకు కారణమయ్యే చెట్ల కొమ్మలు, పిచ్చిమొక్కలను తొలగించాలన్నారు. పాఠశాలలు, కళాశాలల్లో విద్యార్థులకు రహదారి భద్రతా నియమాలపై అవగాహన కల్పించాలని సూచించారు. మున్సిపాలిటీలు, మండల కేంద్రాల్లో పశువులు రహదారులపై సంచరించకుండా వాటి యజమానులకు నోటీసులు జారీ చేయాలన్నారు. ప్రమాదాల నివారణకు అన్ని శాఖల అధికారులు సమన్వయంతో పనిచేయాలని స్పష్టం చేశారు.

నెల రోజుల్లో ఏడుగురి మృతిజిల్లాలో గత నెల రోజుల్లో జరిగిన రహదారి ప్రమాదాల్లో ఏడుగురు ప్రాణాలు కోల్పోయారని ఎస్పీ నితికా పంత్ తెలిపారు. మద్యం సేవించి వాహనాలు నడపడం, అతివేగం, మూలమలుపుల వద్ద నిర్లక్ష్యంగా వ్యవహరించడం ప్రమాదాలకు ప్రధాన కారణాలవుతున్నాయన్నారు. వాహనదారులు రహదారి భద్రతా నిబంధనలను తప్పనిసరిగా పాటిస్తూ సురక్షితంగా గమ్యస్థానాలకు చేరుకోవాలని సూచించారు.సమావేశంలో డీఎస్పీ అశోక్, రోడ్లు, భవనాలు, పంచాయతీరాజ్ ఇంజినీరింగ్, జాతీయ రహదారుల సంస్థ అధికారులు, సంబంధిత శాఖల ప్రతినిధులు పాల్గొన్నారు.

రహదారుల వెంట పోలీసుల ఆకస్మిక తనిఖీలు

అక్రమ కార్యకలాపాలకు పాల్పడితే చర్యలు తప్పవు



జననినాదం,ఆసిఫాబాద్‌జిల్లా ప్రతినిధి అక్టోబర్ 29: జాతీయ రహదారుల వెంట ఉన్న టీ స్టాల్స్, పాన్ షాపులు, దాబాలు, ఇతర వ్యాపార కేంద్రాల్లో పోలీసులు ఏకకాలంలో ఆకస్మిక తనిఖీలు నిర్వహించారు. గురువారం డీఎస్పీ బి.అశోక్ ఆధ్వర్యంలో ఈ తనిఖీలు చేపట్టారు. ఆయా కేంద్రాల్లో నిర్వహిస్తున్న కార్యకలాపాలు, అందుబాటులో ఉన్న సదుపాయాలు, సంబంధిత అనుమతుల వివరాలను పరిశీలించారు.

అక్రమ కార్యకలాపాలపై నిఘా...

అనుమతులు లేకుండా వర్మిట్ రూములు నిర్వహించడం, అక్రమంగా మద్యం నిల్వ చేయడం, విక్రయించడం, మద్యం సేవించేందుకు అనధికారికంగా ఏర్పాట్లు చేయడం వంటి చర్యలకు పాల్పడరాదని వ్యాపార నిర్వాహకులను పోలీసులు హెచ్చరించారు. దాబాలు, టీ స్టాల్స్, పాన్ షాపులను కేంద్రంగా చేసుకుని జూదం, పేకాట, సట్కా మట్కా వంటి చట్టవిరుద్ధ కార్యకలాపాలు జరగకుండా నిర్వాహకులు బాధ్యత వహించాలని స్పష్టం చేశారు.

అనుమానాస్పద కదలికలపై అప్రమత్తంగా ఉండాలి

జాతీయ రహదారుల వెంట అనుమానాస్పద వ్యక్తులు, వాహనాల కదలికలపై నిఘా ఉంచాలని, అనుమానాస్పద కార్యకలాపాలు గుర్తిస్తే వెంటనే పోలీసులకు సమాచారం అందించాలని సూచించారు. మద్యం సేవించి వాహనాలు నడపడం వల్ల రోడ్డు ప్రమాదాలు జరిగే ప్రమాదం ఉందని, అలాంటి చర్యలను ప్రోత్సహించరాదని పేర్కొన్నారు. రహదారి భద్రతా నిబంధనలను ప్రతి ఒక్కరూ పాటించాలని తెలిపారు.నిబంధనలు ఉల్లంఘిస్తే చట్టపరమైన చర్యలువ్యాపార నిర్వాహకులు సంబంధిత శాఖల అనుమతులు పొందడంతోపాటు ప్రభుత్వ నిబంధనలను తప్పనిసరిగా పాటించాలని పోలీసులు స్పష్టం చేశారు. నిబంధనలకు విరుద్ధంగా కార్యకలాపాలు నిర్వహించినా, చట్టవిరుద్ధ పనులకు సహకరించినా బాధ్యులపై చట్టప్రకారం చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు. జిల్లాలో శాంతిభద్రతల పరిరక్షణ, అసాంఘిక కార్యకలాపాల నియంత్రణ, ప్రజల భద్రత కోసం పోలీసు శాఖ నిరంతరం నిఘా కొనసాగిస్తుందని తెలిపారు.ఈ తనిఖీల్లో ఆసిఫాబాద్ నీఐ నీలం రవి, రెబ్బెన నీఐ సంజయ్‌కుమార్, రెబ్బెన ఎస్ఐ వెంకటకృష్ణ, వాంకిడి ఎస్ఐ మహేందర్‌తో పాటు పోలీసు సిబ్బంది పాల్గొన్నారు.



బియ్యం అక్రమ నిల్వలు, రవాణాకు పాల్పడితే కఠిన చర్యలు

జిల్లా అదనపు కలెక్టర్ (రెవెన్యూ) వి.రాములు

జననినాదం,మంచిర్యాల ప్రతినిధి అక్టోబర్ 29: జిల్లాలో బియ్యం అక్రమ నిల్వలు, రవాణాకు పాల్పడటం, అసాధారణంగా ధరలు పెంచడం, కృత్రిమ కొరత సృష్టించడం ద్వారా ప్రజలలో ఆందోళన కలిగించే చర్యలకు పాల్పడితే కఠిన చర్యలు తీసుకోవడం జరుగుతుందని జిల్లా అదనపు కలెక్టర్ (రెవెన్యూ) వి.రాములు అన్నారు. గురువారం జిల్లాలోని నస్పూర్ లో గల సమీకృత జిల్లా కార్యాలయాల భవన సముదాయంలో ఏర్పాటు చేసిన జిల్లా స్థాయి ధరల పర్యవేక్షణ కమిటీ సమావేశానికి జిల్లా పౌర సరఫరాల అధికారి వేణుగోపాల్, జిల్లా మేనేజర్ శ్రీకళ, అధికారులతో కలిసి హాజరై కమిటీ సభ్యులు, బియ్యం వ్యాపారులు, హోల్‌సేల్ వ్యాపారులు, కిరాణా వర్తకులతో బియ్యం నిల్వలు, ధరల నియంత్రణ, మార్కెట్ పరిస్థితులపై సమీక్ష నిర్వహించారు. ఈ సందర్భంగా అదనపు కలెక్టర్ మాట్లాడుతూ జిల్లాలో బియ్యం నిల్వలు, సరఫరా, ధరల విషయంలో వ్యాపారులు పారదర్శకంగా వ్యవహరించాలని తెలిపారు. బ్లాక్ మార్కెటింగ్, అక్రమ నిల్వలు, అధిక ధరలకు విక్రయించడం, కృత్రిమ కొరత సృష్టించడం వంటి చర్యలకు ఎట్టి పరిస్థితులలోనూ పాల్పడరాదని ప్రజలలో అనవసర భయాందోళనలు కలిగించే విధంగా వ్యవహరించవద్దని తెలిపారు. ప్రతి వ్యాపారి రోజువారీగా తమ



వద్ద అందుబాటులో ఉన్న బియ్యం నిల్వల వివరాలను స్టాక్ బోర్డులపై స్పష్టంగా ప్రదర్శించాలని, విక్రయ ధరలను కూడా పారదర్శకంగా అందరికీ కనిపించేలా ఏర్పాటు చేయాలని ఆదేశించారు. నిబంధనలను ఉల్లంఘించే వారిపై నిత్యావసర వస్తువుల చట్టంతో పాటు వర్తించే ఇతర చట్టాలు, నిబంధనల ప్రకారం కఠిన చర్యలు తీసుకుంటామని తెలిపారు. ప్రజలకు అవసరమైన బియ్యం సరసమైన ధరలకు అందుబాటులో ఉండేలా వ్యాపారులు అధికారులకు సహకరించాలని, మార్కెట్‌లో అనవసర ధరల పెరుగుదల, అక్రమ నిల్వలు చోటుచేసుకోకుండా బాధ్యతాయుతంగా వ్యవహరించాలని తెలిపారు.ఈ సమావేశంలో డి.హెచ్.ఓ. డిఎంఓ, డి టి సి ఎస్, రెవెన్యూ ఇన్‌స్పెక్టర్లు, సంబంధిత అధికారులు పాల్గొన్నారు.

పాఠశాలల్లో విద్యా ప్రమాణాలు పెంచాలి

పదో తరగతి విద్యార్థులపై ప్రత్యేక శ్రద్ధ చూపాలి

డీడీ జాదవ్ అంబాజీ

పలు ఆశ్రమ పాఠశాలల తనిఖీ

జననినాదం,ఆసిఫాబాద్ 29: పాఠశాలల్లో విద్యా ప్రమాణాలను పెంపొందిస్తూ విద్యార్థులు మెరుగైన ఫలితాలు సాధించేలా ఉపాధ్యాయులు కృషి చేయాలని గిరిజన సంక్షేమ శాఖ డిప్యూటీ డైరెక్టర్ జాదవ్ అంబాజీ అన్నారు. గురువారం కుమురం భీమ్ ఆసిఫాబాద్ జిల్లా కేంద్రంలోని గిరిజన సంక్షేమ ఆశ్రమ పాఠశాల బాలుర విభాగం, ఆదర్శ క్రీడా పాఠశాల బాలికల విభాగాన్ని ఆయన ఆకస్మికంగా తనిఖీ చేశారు. విద్యార్థుల హాజరు, బోధన తీరు, పదో తరగతి పరీక్షల సన్నద్ధతను పరిశీలించారు. దసరా సెలవుల అనంతరం పాఠశాలలు పునఃప్రారంభమైన నేపథ్యంలో విద్యార్థుల హాజరు శాతాన్ని సమీక్షించారు. విద్యార్థులందరూ క్రమం తప్పకుండా పాఠశాలలకు హాజరయ్యేలా చూడాలని సిబ్బందికి సూచించారు. బోధనలో నాణ్యతను పెంచుతూ నిర్దేశిత విద్యా లక్ష్యాలను సాధించాలని పేర్కొన్నారు. పదో తరగతి విద్యార్థుల కోసం రూపొందించిన వంద రోజుల కార్యాచరణ ప్రణాళిక అమలును సమీక్షించారు. సబ్జెక్టుల వారీగా ప్రత్యేక తరగతులు నిర్వహించాలని, చదువులో వెనుకబడిన విద్యార్థులపై ప్రత్యేక శ్రద్ధ చూపాలని సూచించారు. పరీక్షల్లో మెరుగైన ఫలితాలు సాధించేలా ప్రణాళికాబద్ధంగా బోధన సాగిస్తూ



విద్యార్థుల్లో ఆత్మవిశ్వాసాన్ని పెంపొందించాలని తెలిపారు.

క్రీడాకారిణులకు అభినందనలు...

రాష్ట్రస్థాయి క్రీడా పోటీల్లో ప్రతిభ కనబరిచిన ఆదర్శ క్రీడా పాఠశాల బాలికలతో డీడీ మాట్లాడి వారి విజయాలు, శిక్షణ వివరాలను తెలుసుకున్నారు. విద్యతోపాటు క్రీడలకూ సమాన ప్రాధాన్యం ఇవ్వాలని, క్రమశిక్షణతో నిరంతరం సాధన చేస్తూ మరిన్ని విజయాలు సాధించాలని సూచించారు. విద్యార్థినుల్లోని క్రీడా ప్రతిభను వెలికితీసేందుకు అవసరమైన ప్రోత్సాహం అందించాలని సిబ్బందికి తెలిపారు. ఈ కార్యక్రమంలో ఏటీడీవో చిరంజీవి, జిల్లా క్రీడల అధికారి మడావి శేఖు, జీసీడీవో కొట్నాక శకుంతల, ప్రధానోపాధ్యాయులు చంద్రశేఖర్, లింబారావు, ఉపాధ్యాయులు, పాఠశాల సిబ్బంది పాల్గొన్నారు.

కరువు రాష్ట్రంగా ప్రకటించి రైతులను ఆదుకోవాలి

ఎకరాకు రూ.50 వేల పరిహారం ఇవ్వాలి

సీపీఎం రాష్ట్ర కార్యదర్శి జాన్ వెస్లీ డిమాండ్

జననినాదం,ఆసిఫాబాద్‌జిల్లా ప్రతినిధి అక్టోబర్ 29: రాష్ట్రవ్యాప్తంగా కరువు పరిస్థితులు నెలకొన్న నేపథ్యంలో ప్రభుత్వం తక్షణమే స్పందించి, రాష్ట్రాన్ని కరువు రాష్ట్రంగా ప్రకటించి రైతులను ఆదుకోవాలని సీపీఎం రాష్ట్ర కార్యదర్శి జాన్ వెస్లీ డిమాండ్ చేశారు. ఎల్‌నినో ప్రభావంపై ముందస్తు హెచ్చరికలు ఉన్నప్పటికీ నివారణ చర్యలు చేపట్టడంలో ప్రభుత్వం విఫలమైందని విమర్శించారు. జిల్లా కేంద్రంలోని రోజ్ గార్డెన్‌లో జిల్లా కార్యదర్శి కుశాన రాజన్న అధ్యక్షతన ఏర్పాటు చేసిన సమావేశంలో ఆయన మాట్లాడారు.

రాష్ట్రంలో వర్షపాతం లోటుతో వ్యవసాయం సంక్షోభంలో పడిందని, ఇప్పటికే ఆరు లక్షల బోర్లు నీరు లేక నిరుపయోగంగా మారాయని పేర్కొన్నారు.ఎకరాకు వాణిజ్య పంటలకు రూ.50 వేలు, ఇతర పంటలకు రూ.30 వేల చొప్పున నష్టపరిహారం చెల్లించాలన్నారు.రాష్ట్రానికి కేంద్రం రూ.50 వేల కోట్ల నిధులు మంజూరు చేయాలని కోరారు. మహారాష్ట్రకు నిధులు కేటాయిస్తూ తెలంగాణకు కేటాయించకపోవడం అన్యాయమన్నారు. రాష్ట్ర ప్రభుత్వం అఖిలపక్షాన్ని ఢిల్లీకి తీసుకెళ్లి కేంద్రంపై ఒత్తిడి తెచ్చి నిధులు సాధించాలని సూచించారు. రేషన్ కార్డుదారులకు14 రకాల



నిత్యావసర వస్తువులు అందించాలన్నారు. కౌలు రైతులు, వ్యవసాయ కూలీలను ఆదుకోవాలని, ఆరుతడి పంటల సాగుపై ప్రభుత్వం స్పష్టమైన ప్రకటన చేయాలని అన్నారు.గ్రామీణ ప్రాంతాల్లో నెలకొన్న కరువు పరిస్థితులు రానున్న రోజుల్లో పట్టణాలపైనా ప్రభావం చూపే అవకాశం ఉందని జాన్ వెస్లీ పేర్కొన్నారు. పరిస్థితులను ముందుగానే అంచనా వేసి ప్రభుత్వం తగిన చర్యలు చేపట్టాలని సూచించారు. గిరిజన ప్రాంతాల్లో అటవీ అధికారుల దాడులు పెరుగుతున్నాయని ఆవేదన వ్యక్తం చేశారు. టైగర్ రిజర్వ్ ప్రాజెక్టు పేరుతో గిరిజనుల భూములను కార్పొరేట్ సంస్థలకు అప్పగించే ప్రయత్నాలను అడ్డుకుంటామని హెచ్చరించారు.ఈ కార్యక్రమంలో ఆదివాసీ గిరిజన సంఘం నాయకులు బండారు రవికుమార్,సీపీఎం రాష్ట్ర కమిటీ సభ్యుడు భూపాల్ఈ సమావేశంలో సీపీఎం జిల్లా కార్యదర్శి వర్గ సభ్యులు దుర్గం దినకర్, కోట శ్రీనివాస్, జిల్లా కమిటీ సభ్యులు కార్తీక్, రాజేందర్, ఆనంద్, కృష్ణమాచారి, టీకానంద్ పాల్గొన్నారు.

చదువుతోపాటు అన్ని రంగాల్లో రాణించాలి

విద్యార్థుల సమస్యలు పరిష్కరిస్తాం

మోడల్ స్కూల్ ఫ్రెషర్స్ డేలో ఎమ్మెల్యే అనిల్ జాదవ్

జననినాదం,బోథ్ 29: విద్యార్థులు చదువుతోపాటు క్రీడలు, ఇతర రంగాల్లోనూ రాణించాలని బోథ్ ఎమ్మెల్యే అనిల్ జాదవ్ అన్నారు. గురువారం బోథ్ మండల కేంద్రంలోని తెలంగాణ మోడల్ స్కూల్‌లో నిర్వహించిన ఫ్రెషర్స్ డే వేడుకలకు ఆయన ముఖ్యఅతిథిగా హాజరయ్యారు. పాఠశాలకు చేరుకున్న ఎమ్మెల్యేకు విద్యార్థినులు ఘనంగా స్వాగతం పలికారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ విద్యార్థులు ఉన్నత లక్ష్యాలను నిర్దేశించుకొని వాటిని సాధించే దిశగా కృషి చేయాలన్నారు. పాఠశాలలో నెలకొన్న సమస్యలను తొమ్మిదో తరగతి విద్యార్థినులు తన దృష్టికి తీసుకురాగా, సానుకూలంగా స్పందించారు. క్రీడా మైదానంలో గ్రావెల్ వేయిస్తామని, లైట్ల సమస్యను తక్షణమే పరిష్కరిస్తామని హామీ ఇచ్చారు. విద్యార్థినులకు ఎప్పుడు ఏ అవసరం వచ్చినా అండగా ఉంటానని భరోసా కల్పించారు.నియోజకవర్గ కేంద్రంలోని మోడల్ స్కూల్‌కు మరింత గుర్తింపు తీసుకురావాలని సూచించారు. పాఠశాలను ప్రైమరీ మోడల్ స్కూల్‌గా మార్చే విషయమై రెండు రోజుల



క్రితమే విద్యాశాఖ కార్యదర్శిని కలిసినట్లు తెలిపారు. త్వరలోనే ఈ దిశగా చర్యలు తీసుకొని విద్యార్థులకు విద్యాసేవలు అందిస్తామని పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో మాజీ ఎంపీపీ తుల శ్రీనివాస్, సర్పంచుల సంఘం మాజీ అధ్యక్షుడు శ్రీధర్‌రెడ్డి, సర్పంచులు రాజు రెడ్డి, రూప్‌చంద్, సంజయ్, బాబులాల్, ఎలుక రాజు, పట్టణ అధ్యక్షుడు అల్లకొండ ప్రశాంత్, యువజన అధ్యక్షుడు ప్రవీణ్, నాయకులు రాకేష్‌రెడ్డి, సంజీవ్, రమణగౌడ్, గంగమల్లు తదితరులు పాల్గొన్నారు.

రోడ్డు భద్రత నిబంధనలను ప్రతి ఒక్కరు విధిగా పాటించాలి

అదనపు కలెక్టర్ రాజాగౌడ్

నిజామాబాద్, అక్టోబర్ 29: రోడ్డు భద్రత నిబంధనలను ప్రతి ఒక్కరూ విధిగా పాటించాలని అదనపు కలెక్టర్ రాజాగౌడ్ సూచించారు. గురువారం కలెక్టరేట్ కార్యాలయంలో నిర్వహించిన రోడ్డు భద్రత జిల్లా స్థాయి సమావేశంలో ఆయన మాట్లాడుతూ, ఇటీవల కాలంలో వివిధ కారణాల వల్ల రోడ్డు ప్రమాదాలు పెరిగిపోతున్నాయని ఆందోళన వ్యక్తం చేశారు. రోడ్డు ప్రమాదాలను నివారించాల్సిన బాధ్యత ప్రతి ఒక్కరిపై ఉందని అన్నారు. ఈ దిశగా సంబంధిత శాఖలు కూడా సమన్వయంతో పని చేయాలన్నారు. రోడ్డు ప్రమాదాలు



జరిగేందుకు అస్కారం ఉన్న ప్రదేశాలను గుర్తించి ప్రమాదాలు సంభవించకుండా కట్టుదిట్టమైన చర్యలు చేపట్టాలని అన్నారు. ఈ సమావేశంలో సంబంధిత శాఖల అధికారులు పాల్గొన్నారు.

గుజరాత్ లో జరిగే రాష్ట్రీయ ఏక్తా దివస్ ఉత్సవ్ కు కరీంనగర్ బృందం

కరీంనగర్ అక్టోబర్ 29: అక్టోబర్ 31న గుజరాత్ రాష్ట్రం లోని కెవాడియా (ఎక్తానగర్) లో జరిగే రాష్ట్రీయ ఏక్తా దివస్ ఉత్సవ్ కు కరీంనగర్ నుంచి జిల్లా యంత్రాంగం ద్వారా విశిష్ట రంగాల ప్రముఖులను ఎంపిక చేసింది. ఇందులో పెండ్యాల కేశవరెడ్డి, అన్నవరం దేవేందర్, ఏ. కిరణ్ కుమార్, సింగిరెడ్డి ప్రభాకర్ రెడ్డి, గోగుల ప్రసాద్, అకెనపల్లి నాగరాజు,చీటీ అజిత్ కుమార్, కాకుల మారి ప్రసూన్ రావు (విజయ్), కొండపల్లి ప్రభాకర్ రెడ్డి లు ఉన్నారు. వీరంతా ఈరోజు గురువారం సికింద్రాబాద్ రైల్వే స్టేషన్ నుంచి అడిషనల్ డిసిపి పి. వెంకట రమణ ఆధ్వర్యంలో ప్రయాణమయ్యారు. శుక్రవారం ఉదయం గుజరాత్ లోని ఏక్తా నగర్ కు చేరి శనివారం రోజు భారత ప్రధాని నరేంద్ర మోది ముఖ్య అతిథిగా హాజరయ్యే ఉత్సవంలో ప్రత్యేక ఆహ్వానితులుగా వీరు పాల్గొంటారు. అక్టోబర్ 31 న



సర్దార్ వల్లభాయ్ పటేల్ జయంతి ఉత్సవాన్ని పురస్కరించుకొని కేంద్ర ప్రభుత్వ ఆధ్వర్యంలో ఈ కార్యక్రమం నిర్వహించబడుతుంది. తెలంగాణలోని అన్ని జిల్లాల నుంచి విశిష్ట రంగాల్లోని వ్యక్తులను గుజరాత్ కు ఆహ్వానించారు.

డ్రగ్స్ సరఫరా మూలాలను సమూలంగా ఛేదించాలి

పోలీస్ కమిషనర్ అంబర్ కిషోర్ ఝా

పెడ్లర్లపై నిరంతర నిఘా.. సరఫరా వ్యవస్థ మూలాలను గుర్తించి ఛేదించాలి:

ఈగిల్ టీమ్ ఎస్పీ గిరిధర్

గోదావరిఖని29: గంజాయి,ఇతర మాదకద్రవ్యాల సరఫరా, విక్రయాలను అరికట్టేందుకు సరఫరా చేసే పెడ్లర్లపై నిరంతర నిఘా ఉంచడంతో పాటు, వారికి మాదకద్రవ్యాలను సరఫరా చేస్తున్న మూలాలను గుర్తించి మొత్తం సరఫరా వ్యవస్థను ఛేదించాలని తెలంగాణ నార్కోటిక్స్ కంట్రోల్ బ్యూరో (ఈగిల్ టీమ్) ఎస్పీ గిరిధర్ పోలీస్ అధికారులను ఆదేశించారు.

గురువారం రామగుండం పోలీస్ కమిషనరేట్ కార్యాలయంలో నార్కోటిక్ డ్రగ్స్ అండ్ సైకోట్రోపిక్ సబ్‌స్టాన్సెస్ (చీఝా) కేసులపై ఉన్నతస్థాయి సమీక్షా సమావేశం నిర్వహించారు. ఈ సమావేశంలో రామగుండం కమిషనరేట్ పరిధిలో నమోదైన చీఝా కేసుల పురోగతి,పెండింగ్ కేసులు,దర్యాప్తు స్థితిగతులు, నిందితుల కార్యకలాపాలు, గంజాయి సరఫరా మార్గాలు తదితర అంశాలను ఎస్పీ గిరిధర్ సమగ్రంగా సమీక్షించారు. పెండింగ్‌లో ఉన్న కేసులకు గల కారణాలను అధికారులను అడిగి తెలుసుకున్నారు. ప్రతి కేసులో దర్యాప్తు పురోగతిని పరిశీలిస్తూ,కేసుల దర్యాప్తును వేగవంతం చేయడంతో పాటు, సాక్ష్యాధారాల సేకరణ,నిందితుల గుర్తింపు,సరఫరా మూలాల అన్వేషణ తదితర అంశాల్లో దర్యాప్తు అధికారులు వృత్తిపరమైన నైపుణ్యంతో వ్యవహరించాలని సూచించారు.

సరఫరా గొలుసును ఛేదించడమే లక్ష్యం

ఈ సందర్భంగా ఈగల్ టీమ్ ఎస్పీ గిరిధర్ మాట్లాడుతూ గంజాయి విక్రయించే వ్యక్తులను మాత్రమే గుర్తించి కేసులు నమోదు చేయడం కాకుండా,వారికి గంజాయి ఎక్కడి నుంచి



వస్తోంది, ఎవరు సరఫరా చేస్తున్నారు,ఏ మార్గాల్లో రవాణా చేస్తున్నారు అనే అంశాలపై లోతైన దర్యాప్తు చేపట్టాలని సూచించారు.గంజాయి, మాదకద్రవ్యాల సరఫరా గొలుసులోని ప్రతి స్థాయిని గుర్తించి, పెడ్లర్ల నుంచి ప్రధాన సరఫరాదారుల వరకు మొత్తం నెట్‌వర్క్‌ను ఛేదించే విధంగా సమన్వయంతో దర్యాప్తు చేపట్టాలని ఆదేశించారు. మాదకద్రవ్యాల అక్రమ రవాణా, నిల్వ,విక్రయాలపై నిరంతర నిఘా కొనసాగించాలని, అనుమానాస్పద వ్యక్తులు,ప్రదేశాలు, సరఫరా మార్గాలపై ప్రత్యేక దృష్టి సారించాలని సూచించారు.మాదకద్రవ్య రహిత కమిషనరేట్‌గా రామగుండంరామగుండం పోలీస్ కమిషనర్ అంబర్ కిషోర్ ఝా మాట్లాడుతూ రామగుండం పోలీస్ కమిషనరేట్‌ను మాదకద్రవ్య రహిత కమిషనరేట్‌గా తీర్చిదిద్దేందుకు పోలీస్ శాఖ నిరంతరం కృషి చేస్తోందని తెలిపారు. గంజాయి,ఇతర మత్తు పదార్థాల అక్రమ విక్రయాలు, నిల్వలు, రవాణాపై నిరంతరం సమాచార వ్యవస్థను బలోపేతం చేస్తూ ప్రత్యేక నిఘా కొనసాగిస్తున్నామని చెప్పారు. మాదకద్రవ్యాల కేసుల్లో దర్యాప్తు అధికారులు వృత్తిపరమైన నైపుణ్యంతో, చట్టపరమైన విధానాలను ఖచ్చితంగా పాటిస్తూ దర్యాప్తు చేపట్టాలని సూచించారు.చీఝా చట్టం నిబంధనల ప్రకారం నిందితుల అక్రమంగా సంపాదించిన ఆస్తులను గుర్తించి, చట్టపరమైన ప్రక్రియను అనుసరించి ప్రాపర్టీ సీజ్/ఫ్రీజ్ చర్యలు చేపట్టాలని ఆదేశించారు. నిందితులకు మాదకద్రవ్యాలు సరఫరా చేస్తున్న ప్రధాన వ్యక్తులు, సరఫరా మార్గాలు, ఆర్థిక లావాదేవీలు, నెట్‌వర్క్‌పై దృష్టి సారించి దర్యాప్తును విస్తరించాలని సూచించారు. మాదకద్రవ్యాల నిర్మూలన కేవలం కేసులు నమోదు చేయడంతో పూర్తికాదని, సరఫరా మూలాలను ఛేదించడం, వినియోగదారులను గుర్తించి కౌన్సెలింగ్ అందించడం, యువతను అవగాహన కార్యక్రమాల ద్వారా చైతన్యవరచడం వంటి బహుముఖ చర్యలు అవసరమని కమిషనర్ తెలిపారు. యువత డ్రగ్స్ బారిన పడకుండా కాపాడటం, మాదకద్రవ్యాల వల్ల కలిగే దుష్పరిణామాలపై ప్రజల్లో అవగాహన కల్పించడం,డ్రగ్స్ సరఫరా వ్యవస్థను సమూలంగా నిర్మూలించడం పోలీస్ శాఖ ప్రధాన లక్ష్యమని స్పష్టం చేశారు.

యువతకు సీపీ దిశానిర్దేశం..

వ్యసనాలకు దూరంగా ఉండి ఉన్నత లక్ష్యాలను సాధించాలి

సమావేశం సందర్భంగా రామగుండం కమిషనరేట్ పరిధిలో గంజాయికి అలవాటుపడిన 55 మంది యువతతో పోలీస్ కమిషనర్ అంబర్ కిషోర్ ఝా, ఈగల్ టీమ్ ఎస్పీ గిరిధర్ మాట్లాడి వారికి కౌన్సెలింగ్ అందించారు.యువత తమలో ఉన్న శక్తి, సామర్థ్యాలను సానుకూల దిశలో వినియోగించుకుని జీవితంలో ఉన్నత లక్ష్యాలను సాధించాలని సీపీ సూచించారు. ఒత్తిడి,చెడు స్నేహాలు,తాత్కాలిక ఆకర్షణల కారణంగా మాదకద్రవ్యాలకు అలవాటుపడిన వారు వాటికి పూర్తిగా దూరమై, అవసరమైన సందర్భంలో పునరావాస సహాయాన్ని పొందుతూ కొత్త జీవితాన్ని ప్రారంభించాలని సూచించారు.

మాదకద్రవ్యాల వినియోగం వ్యక్తిగత ఆరోగ్యాన్ని దెబ్బతీయడంతో పాటు కుటుంబంపై, విద్యపై,ఉపాధిపై, భవిష్యత్తుపై తీవ్ర ప్రభావం చూపుతుందని హెచ్చరించారు. తల్లిదండ్రుల ఆశయాలను నెరవేర్చే బాధ్యత యువతపై ఉందని గుర్తుచేశారు. విద్య,సాంకేతిక నైపుణ్యాలు,ఉపాధి అవకాశాలపై దృష్టి సారించి, ఆత్మవిశ్వాసం మరియు పట్టుదలతో ముందుకు సాగాలని సూచించారు. యువతకు నైపుణ్యాభివృద్ధి, ఉపాధి అవకాశాలు కల్పించేందుకు పోలీస్ శాఖ తరఫున అవసరమైన సహకారం అందిస్తామని తెలిపారు.సంబంధిత శాఖల అధికారులతో సమన్వయం చేసుకుని, అవసరమైన యువతకు ప్రత్యేక బృందాల ద్వారా నిరంతర సహాయం, మార్గదర్శకత్వం అందించేందుకు చర్యలు తీసుకుంటామని హామీ ఇచ్చారు.వ్యసనాలకు దూరంగా ఉండండి.. మీ జీవితాన్ని మీరే మార్చుకోండి. మంచి పౌరులుగా ఎదిగి మీ కుటుంబానికి గర్వకారణంగా నిలవండని యువతకు సీపీ సూచించారు

అధికారుల సమన్వయంతో ప్రత్యేక చర్యలు

చీఝా కేసుల దర్యాప్తులో పోలీస్ స్టేషన్ల అధికారులు, టాస్క్‌ఫోర్స్, ఈగల్ టీమ్ అధికారులు పరస్పర సమన్వయంతో పనిచేయాలని సమావేశంలో సూచించారు. మాదకద్రవ్యాల సరఫరా, రవాణా, విక్రయాలపై అందే సమాచారాన్ని సమగ్రంగా విశ్లేషించి, సంబంధిత నెట్‌వర్క్‌పై ఏకకాలంలో చర్యలు చేపట్టాలని ఆదేశించారు.మాదకద్రవ్యాలపై ప్రజల నుంచి వచ్చే సమాచారాన్ని ప్రాధాన్యతతో పరిశీలించి, సమాచారదాతల వివరాలను గోప్యంగా ఉంచుతూ చట్టపరమైన చర్యలు చేపట్టాలని అధికారులకు సూచించారు.ఈ సమావేశంలో మంచిర్యాల డీసీపీ ఎ.భాస్కర్, అడిషనల్ డీసీపీ (అడ్మిన్) కె. శ్రీనివాస్, గోదావరిఖని ఏసీపీ ఎం.రమేష్, మంచిర్యాల ఏసీపీ ఆర్.ప్రకాష్, జైపూర్ ఏసీపీ ఆర్. వెంకటేశ్వర్లు, బెల్లంపల్లి కిరణ్ కుమార్, టాస్క్ ఫోర్స్ ఏసీపీ శ్రీనివాస్,ఈగల్ ఫోర్స్ కరీంనగర్ ఆర్ఎన్‌సీసీ డీఎస్పీ ఎస్.ఉపేందర్, నిజామాబాద్ ఆర్ఎన్‌సీసీ డీఎస్పీ సోమనాథ్, హైదరాబాద్ ఆర్ఎన్‌సీసీ డీఎస్పీ పుష్పకుమార్, సీఐలు,ఎస్ఐలు తదితరులు పాల్గొన్నారు.

లాస్య కుటుంబానికి న్యాయం చేయాలని..

మార్చురీ వద్ద ఎమ్మెల్యే కొత్త ప్రభాకర్ రెడ్డి ధర్నా



తొగుట : కస్తూరిబా గాంధీ పాఠశాల విద్యార్థిని లాస్య ఆకస్మిక మృతి విచారణ చేపట్టి బాలి కుటుంబానికి న్యాయం చేయాలని దుబ్బాక ఎమ్మెల్యే కొత్త ప్రభాకర్ రెడ్డి డిమాండ్ చేశారు. ఈ మేరకు సిద్దిపేట ప్రభుత్వ దవాఖాన వద్ద లాస్య కుటుంబ సభ్యులను పరామర్శించి వారి కుటుంబానికి న్యాయం చేయాలని మార్చురీ ముందు బైఠాయించి ధర్నా చేపట్టారు. సమగ్ర విచారణ జరిపి న్యాయం చేసేంత వరకు నిరసన కొనసాగిస్తామని స్పష్టం చేశారు. రాష్ట్రంలో ఇటీవల కాలంలో గురుకుల పాఠశాలల్లో విద్యార్థుల మరణాలపై ఆందోళన వ్యక్తం చేశారు. ఆయన వెంట బీఆర్ఎస్ నాయకులు, కార్యకర్తలు ఉన్నారు. కాగా, కస్తూర్బా పాఠశాలలో విద్యార్థిని ఆకస్మిక మృతి స్థానికంగా కలకలం రేపింది. సిద్దిపేట జిల్లా తొగుట మండలంలోని గుడికందులకు చెందిన దావులగల్ల లాస్య సిద్దిపేట మండలం రాఘవపూర్‌లోని కస్తూర్బా పాఠశాలలో పదో తరగతి చదువుతోంది. ఆరోగ్యంగా ఉన్న లాస్య దసరా సెలవుల అనంతరం యథావిధిగా హాస్టల్‌కు వెళ్లింది. అయితే, అనూహ్యంగా ఆమె మృతి చెందడం కుటుంబ సభ్యులను, గ్రామస్తులను తీవ్ర విషాదానికి గురిచేసింది. కుటుంబ సభ్యులు తెలిపిన వివరాల ప్రకారం.. బుధవారం రాత్రి 10 గంటల సమయంలో పాఠశాల నుంచి లాస్య తల్లిదండ్రులకు ఫోన్ వచ్చింది. లాస్య పుష్పవతి అయిందని సమాచారం ఇచ్చినట్లు వారు తెలిపారు. గురువారం తెల్లవారుజామున 5 గంటల సమయంలో హాస్టల్‌కు వెళ్లిన తల్లిదండ్రులకు, అప్పటికే లాస్య ఆరోగ్యం క్షీణించడంతో సిద్దిపేట ప్రభుత్వ దవాఖానకు తరలించినట్లు పాఠశాల సిబ్బంది తెలిపారని పేర్కొన్నారు. అయితే, హాస్పిటల్‌కు చేరుకునే సమయానికే లాస్య మృతి చెందినట్లు కుటుంబ సభ్యులు ఆవేదన వ్యక్తం చేశారు. ఆరోగ్యంగా ఉన్న తమ కుమార్తె ఆకస్మికంగా మృతి చెందడంపై తల్లిదండ్రులు తీవ్ర ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. లాస్య మృతికి దారితీసిన పరిస్థితులపై సమగ్ర విచారణ జరిపి, వాస్తవాలను వెలుగులోకి తీసుకురావాలని కుటుంబ సభ్యులు, గ్రామస్తులు డిమాండ్ చేస్తున్నారు. బాధిత కుటుంబానికి న్యాయం చేసి, ఆదుకోవాలని కోరుతున్నారు. ప్రస్తుతం లాస్య మృతదేహం సిద్దిపేట ప్రభుత్వ దవాఖాన మార్చురీలో ఉంది.

అభివృద్ధి పనుల సాధనకు నవంబర్ 2న కోరుకంటి చందర్ నిరాహార దీక్ష

- పెద్దంపేట ఓవర్ బ్రిడ్జి, ఖుర్జీ భూములకు పట్టాలు ఇవ్వాలి
- అంతర్గాం--మంచిర్యాల గోదావరి వంతెన,
- ఇండస్ట్రియల్ పార్కు పనులు ప్రారంభించాలి



గోదావరిఖని29: పెద్దంపేట రైల్వే ఓవర్ బ్రిడ్జి నిర్మాణం, ఖుర్జీ కమ్మి భూములకు పట్టాల జారీ, అంతర్గాం--మంచిర్యాల గోదావరి వంతెన నిర్మాణం, ఇండస్ట్రియల్ పార్కు ఏర్పాటు వంటి నాలుగు కీలక అభివృద్ధి పనులను వెంటనే చేపట్టాలని డిమాండ్ చేస్తూ నవంబర్ 2న అంతర్గాం మండల కేంద్రంలో ఒకరోజు నిరాహార దీక్ష చేపట్టనున్నట్లు బీఆర్ఎస్ పెద్దపల్లి జిల్లా అధ్యక్షుడు, రామగుండం మాజీ ఎమ్మెల్యే కోరుకంటి చందర్ ప్రకటించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. కాంగ్రెస్ ప్రభుత్వం ఈ నాలుగు కీలక అంశాలపై తక్షణమే స్పందించి, అభివృద్ధి పనులకు శ్రీకారం చుట్టాలని డిమాండ్ చేశారు. పెద్దంపేట రైల్వే ఓవర్ బ్రిడ్జి నిర్మాణంతో ప్రజలకు రవాణా ఇబ్బందులు తొలగుతాయని, ఖుర్జీ కమ్మి భూములకు పట్టాలు అందించడం ద్వారా భూ సమస్య పరిష్కారమవుతుందని పేర్కొన్నారు. అంతర్గాం--మంచిర్యాల ప్రాంతాలను కలిపేలా గోదావరి నదిపై వంతెన నిర్మాణం చేపట్టాలని, ఇండస్ట్రియల్ పార్కు ఏర్పాటు ద్వారా స్థానికంగా ఉపాధి అవకాశాలు మెరుగుపడతాయని కోరుకంటి చందర్ తెలిపారు. ప్రజా సమస్యల పరిష్కారం, ప్రాంతీయ అభివృద్ధి లక్ష్యంగా చేపడుతున్న ఈ నిరాహార దీక్షకు ప్రజలు, పార్టీ శ్రేణులు మద్దతు తెలపాలని ఆయన కోరారు.

అర్హులైన ప్రతి ఒక్కరికీ డిజిటల్ రేషన్ కార్డులు అందించడమే ప్రభుత్వ లక్ష్యం

మంచిర్యాల మేయర్ ధరణి మధుకర్





మంచిర్యాల, నస్పూర్: అక్టోబర్ 29: తెలంగాణ రాష్ట్ర ప్రభుత్వం ప్రజా సంక్షేమమే ధ్యేయంగా పనిచేస్తూ, అర్హులైన ప్రతి కుటుంబానికి సంక్షేమ పథకాల ఫలాలు అందించేందుకు కృషి చేస్తోందని మంచిర్యాల మున్సిపల్ కార్పొరేషన్ మేయర్ ధరణి మధుకర్ తెలిపారు. మంచిర్యాల మున్సిపల్ కార్పొరేషన్ పరిధిలోని 2, 10వ డివిజన్లలో డిజిటల్ రేషన్ కార్డుల పంపిణీ కార్యక్రమాన్ని మేయర్ ధరణి మధుకర్ ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ, ప్రభుత్వ సంక్షేమ పథకాల ప్రయోజనాలు పొందేందుకు తెల్ల రేషన్ కార్డు ఎంతో కీలకమని పేర్కొన్నారు. ఆధునిక సాంకేతిక పరిజ్ఞానాన్ని వినియోగిస్తూ డిజిటల్ రేషన్ కార్డుల పంపిణీ చేపట్టడం ద్వారా ప్రజలకు పారదర్శకమైన సేవలు అందించేందుకు ప్రభుత్వం కృషి చేస్తోందని తెలిపారు. మంచిర్యాల ఎమ్మెల్యే కొక్కిరాల ప్రేమ్ సాగర్ రావు నాయకత్వంలో నియోజకవర్గంలోని అర్హులైన ప్రతి కుటుంబానికి ప్రభుత్వ సంక్షేమ పథకాలు అందేలా చర్యలు తీసుకుం టున్నామని మేయర్ వెల్లడించారు. ప్రజలకు అవసరమైన ప్రభుత్వ సేవలు, సంక్షేమ పథకాలు ఎలాంటి ఇబ్బందులు లేకుండా అందించడ మే ప్రభుత్వ ప్రధాన లక్ష్యమని స్పష్టం చేశారు. ఈ కార్యక్రమంలో స్థానిక కార్పొరేటర్లు రాచకొండ గోపాల్ రావు, ఎండీ ఖలీద్, కాంగ్రెస్ పార్టీ నాయకులు, కార్యకర్తలు, లబ్ధిదారులు తదితరులు పాల్గొన్నారు.

తెలంగాణకు కేంద్రం రూ.50 వేల కోట్ల నిధులు ప్రకటించాలి

వాణిజ్య పంటలకు ఎకరాకు రూ.50 వేలు, ఆహార పంటలకు రూ.30 వేల పరిహారం ఇవ్వాలి
తాండూరు మండలాన్ని కరువు మండలంగా ప్రకటించాలి
సీపీఎం రాష్ట్ర కార్యదర్శి జాన్ వెస్లీ





తాండూరు,అక్టోబర్ 29: ఎల్‌నినో ప్రభావంతో తెలంగాణలో పంటలు తీవ్రంగా నష్టపోయి రైతులు కరువు పరిస్థితులను ఎదుర్కొంటున్నారని, వారిని ఆదుకునేందుకు కేంద్ర ప్రభుత్వం తెలంగాణకు రూ.50 వేల కోట్ల ప్రత్యేక నిధులు ప్రకటించాలని సీపీఎం రాష్ట్ర కార్యదర్శి జాన్ వెస్లీ డిమాండ్ చేశారు. గురువారం మంచిర్యాల జిల్లా తాండూరు మండలంలో ఎల్‌నినో ప్రభావంతో దెబ్బతిన్న పత్తి పంటలను సీపీఎం రాష్ట్ర బృందం పరిశీలించింది. ఈ సందర్భంగా జాన్ వెస్లీ మాట్లాడుతూ కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు రైతుల సమస్యలను పట్టించుకోవడం లేదని విమర్శించారు. మంచిర్యాల జిల్లాలో 11 మండలాలను కరువు మండలాలుగా ప్రకటించినప్పటికీ తాండూరు మండలాన్ని విస్మరించడం అన్యాయమన్నారు. తాండూరు మండలాన్ని వెంటనే కరువు మండలంగా ప్రకటించి, నష్టపోయిన రైతులను ఆదుకోవాలని కోరారు. నష్టపోయిన వాణిజ్య పంటలకు ఎకరాకు రూ.50 వేలు, ఆహార పంటలకు ఎకరాకు రూ.30 వేల చొప్పున పరిహారం అందించాలని డిమాండ్ చేశారు. పంట నష్టంపై ప్రభుత్వం ప్రత్యేక ప్రణాళిక రూపొందించి రైతులకు అండగా నిలవాలన్నారు.నిత్యావసర ధరలను తగ్గించాలికరువు పరిస్థితుల నేపథ్యంలో నిత్యావసర వస్తువుల ధరలు భారీగా పెరిగాయని, బియ్యం కిలో రూ.90కి చేరడంతో పేద, మధ్యతరగతి ప్రజలు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారని జాన్ వెస్లీ పేర్కొన్నారు. ప్రభుత్వం ధరలను నియంత్రించి, రేషన్ దుకాణాల ద్వారా 14 రకాల నిత్యావసర సరుకులను సబ్సిడీపై పంపిణీ చేయాలని డిమాండ్ చేశారు.ఉపాధి హామీ పనులు 200 రోజులు కల్పించాలి: ఎల్‌నినో ప్రభావంతో వ్యవసాయ పనులు తగ్గి కూలీలకు ఉపాధి దొరకడం లేదని తెలిపారు. ఉపాధి హామీ పథకం కింద సంవత్సరానికి 200 రోజుల పని కల్పించి, రోజుకు రూ.800 కూలి చెల్లించాలని కోరారు. వ్యవసాయ కూలీలకు ఇందిరమ్మ భరోసా పథకం అమలు చేయాలని ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు.రాష్ట్రంలోని కాంగ్రెస్ ప్రభుత్వం అఖిలపక్షాన్ని కలుపుకొని కేంద్ర ప్రభుత్వంపై ఒత్తిడి తెచ్చి రైతులు, వ్యవసాయ కూలీలు, పేద ప్రజలను ఆదుకోవాలని సూచించారు. కేంద్ర ప్రభుత్వం కరువు ప్రాంతాలపై ప్రత్యేక దృష్టి సారించి తక్షణ సహాయక చర్యలు చేపట్టాలని కోరారు. లేనిపక్షంలో సీపీఎం ఆధ్వర్యంలో రాష్ట్రవ్యాప్తంగా ఉద్యమాలను ఉధృతం చేస్తామని హెచ్చరించారు.సీపీఎం రాష్ట్ర బృందానికి సన్మానం: తాండూరు మండల కేంద్రంలోని ఐబీ వద్ద సీపీఎం మండల కమిటీ ఆధ్వర్యంలో రాష్ట్ర కార్యదర్శి జాన్ వెస్లీతో పాటు రాష్ట్ర బృందం సభ్యులను శాలువాలు కప్పి, పూలమాలలతో ఘనంగా సన్మానించారు.ఈ కార్యక్రమంలో సీపీఎం రాష్ట్ర కార్యదర్శివర్గ సభ్యులు ఎం.డి. అబ్బాస్, భూపాల్, ఎం.వి. రమణ, ఆశన్న, రాష్ట్ర కమిటీ సభ్యులు నగేష్, వ్యవసాయ కార్మిక సంఘం రాష్ట్ర నాయకులు, జిల్లా కార్యదర్శి బోడంకి చందు, గోమాస ప్రకాష్, గుమాస అశోక్, దాగం రాజారాం, సాంబార్ వెంకటస్వామి, దాగం శ్రీకాంత్, పాయిరాల రాములు, దుర్గం నాన్నయ్య, బొల్లం రాజేశం, కొమ్మ రాజయ్య తదితర సీపీఎం నాయకులు, రైతులు, కౌలుదారులు పాల్గొన్నారు.

వేలాల మల్లన్న ఆలయంలో గోదావరి తల్లి కన్నీటి గోస..

2.0 యాత్ర బృందం ప్రత్యేక పూజలు

మేడిగడ్డ నుంచి కొండపోచమ్మ సాగర్ వరకు 400 కిలోమీటర్ల మహా సైకిల్ యాత్ర



జైపూర్, అక్టోబర్ 29: గోదావరి నది పరిరక్షణ లక్ష్యంగా చేపట్టిన 'గోదావరి తల్లి కన్నీటి గోస 2.0' యాత్రలో భాగంగా వేలాల శ్రీ మల్లన్న స్వామి దేవస్థానంలో యాత్ర రూపకర్త బొడ్డు రవీందర్ ఆధ్వర్యంలో ప్రత్యేక పూజలు నిర్వహించారు.మేడిగడ్డ నుంచి కొండపోచమ్మ సాగర్ వరకు సుమారు 400 కిలోమీటర్ల మేర సాగుతున్న మహా సైకిల్ యాత్రలో భాగంగా యాత్ర బృందం వేలాల మల్లన్న స్వామిని దర్శించుకుని ప్రత్యేక పూజలు చేసింది. ఈ సందర్భంగా బొడ్డు రవీందర్ మాట్లాడుతూ గోదావరి నది పరిరక్షణపై ప్రజల్లో అవగాహన కల్పించడమే యాత్ర ప్రధాన ఉద్దేశమని తెలిపారు. మాజీ ముఖ్యమంత్రి కేసీఆర్ తిరిగి ముఖ్యమంత్రి కావాలని, ఆయనకు ఆయురారోగ్యాలు ప్రసాదించాలని స్వామివారిని ప్రార్థించినట్లు పేర్కొన్నారు. వేలాల గ్రామంలో గోదావరి సాయి కృష్ణ నేతృత్వంలో యాత్ర బృందానికి ఘన స్వాగతం లభించింది. ఈ కార్యక్రమంలో ఉప్పు రాజ్ కుమార్, మేకల నవీన్, గుండబోయిన శ్రీనివాస్, పారుపల్లి అనిల్, కాశీపాక వాసు, ముత్యం అనిల్ గౌడ్, ఆరేపెల్లి సర్వేష్, సతీష్, మధు తదితరులు పాల్గొన్నారు.

అభివృద్ధిని చూసి ఓర్వలేక తప్పుడు ఆరోపణలు



మందమర్రి,అక్టోబర్ 29 : స్థానిక ప్రెస్ క్లబ్ లో కాంగ్రెస్ పట్టణ అధ్యక్షుడు మంద తిరుమల్ రెడ్డి ఆధ్వర్యంలో గురువారం విలేకరుల సమావేశం నిర్వహించిన డిసిసి అధ్యక్షుడు రఘునాథ రెడ్డి. ఈ సందర్భంగా రఘునాథరెడ్డి మాట్లాడుతూ..చెన్నూరు,పెద్దపల్లి పార్లమెంట్ నియోజకవర్గాలలో జరుగుతున్న అభివృద్ధిని చూసి ఓర్వలేక మంత్రి వివేక్ వెంకటస్వామి,ఎంపీ వంశీ కృష్ణ లపై తప్పుడు ఆరోపణలు చేస్తూ బిజెపి నాయకులు దిగజారుడు రాజకీయాలకు పాల్పడుతున్నరని అన్నారు. కేంద్ర ప్రభుత్వం తీసుకొచ్చిన సర్ ప్రక్రియలో అర్హులైన ఓటర్లను తొలగిస్తున్నారని కాంగ్రెస్ మంత్రులు,ఎంపీలు నిరసనలు ధర్నాలు చేపడితే బిజెపి నాయకులు తప్పు పట్టడం సిగ్గు చేటని ఎద్దేవా చేశారు. పెద్దపల్లి పార్లమెంట్ నియోజవర్గంలోని అసెంబ్లీ నియోజకవర్గాల అభివృద్ధి కి కృషిచేసిన దివంగత నేత కాకా వెంకటస్వామి కుటుంబాన్ని విమర్శించే ముందు బిజెపి నాయకులు నిజ నిజాలు తెలుసుకొని మాట్లాడాలని సూచించారు. కాంగ్రెస్ ఓటు బ్యాంకును తగ్గించాలనే ఉద్దేశంతోనే బిజెపి ప్రభుత్వం సర్ ప్రక్రియను తీసుకొచ్చిందని,నవంబర్ ఒకటవ తేదీ న సర్ ప్రక్రియను వ్యతిరేకిస్తూ ఢిల్లీలోని రామ్ లీలా మైదానంలో ఇండియా కూటమి ఆధ్వర్యంలో జరిగే నిరసన కార్యక్రమాన్ని విజయవంతం చేసేందుకు కాంగ్రెస్ కార్యకర్తలు నాయకులు భారీఎత్తున తరలి రావాలని పిలుపునిచ్చారు.

చెరువుగట్టు అభివృద్ధికి మొదటి ప్రాధాన్యత : ఎమ్మెల్యే వేముల వీరేశం



నార్కట్ పల్లి : చెరువుగట్టు దేవాలయం అభివృద్ధికి మొదటి ప్రాధాన్యత ఇస్తున్నట్లు ప్రభుత్వ విప్ ఎమ్మెల్యే వేముల వీరేశం తెలిపారు. చెరువుగట్టు గ్రామ పరిధిలో సుమారుగా రూ. 50 లక్షలతో చేపట్టే వివిధ అభివృద్ధి పనులకు శంకుస్థాపన, గట్టు పైన రూ. 60 లక్షల రూపాయలతో నిర్మించిన కాంప్లెక్స్ నిర్మాణ ప్రారంభంలో గురువారం పాల్గొని ఈ విధంగా మాట్లాడారు. దేవాలయానికి ఏటేటా భక్తుల సంఖ్య పెరుగుతున్న తరుణంలో అభివృద్ధి చేస్తున్నట్లు వెల్లడించారు. రాబోయే రోజుల్లో భక్తులకు అన్ని వసతులు కల్పిస్తామన్నారు.ముఖ్యంగా అమావాస్య లాంటి పర్వదినాల్లో వచ్చే అధిక సంఖ్య భక్తులకు ఎటువంటి ఇబ్బందులు లేకుండా చేస్తామన్నారు. 100 కోట్ల రూపాయలతో దేవాలయాన్ని అభివృద్ధి చేసేందుకు ప్రణాళికలు చేస్తున్నట్లు వెల్లడించారు. అదేవిధంగా నియోజకవర్గం అభివృద్ధిలో శరవేగంగా దూసుకెళు ్తందని తెలిపారు. అనంతరం గర్భగుడిలో స్వామివారిని దర్శించుకుని మొక్కులు చెల్లించుకున్నారు. ఈ కార్యక్రమంలో సర్పంచ్ నేతకాని కృష్ణ, దేవాలయం చైర్మన్ వారాల రమేష్, మండల పార్టీ అధ్యక్షులు గాయం శ్యాంసుందర్ రెడ్డి, నాయకులు బత్తుల ఉషయ్య గౌడ్, రేగట్టె నవీన్ రెడ్డి, జలంధర్ రెడ్డి, రాజశేఖర్ రెడ్డి, వడ్డే భూపాల్ రెడ్డి, ఆలయ డైరెక్టర్లు కమ్మాలపల్లి మల్లేష్, ఇడుకుల సంపత్, మర్రి లింగస్వామి, నల్ల అనిత, శ్రీనివాస్ రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

విద్యుత్ షాక్‌తో మృతి చెందిన ఆవుకు రూ.40 వేల పరిహారం

మంత్రి శ్రీధర్ బాబు చొరవతో బాధితుడికి ఆర్థిక సాయం



పెద్దపల్లి జిల్లా, అక్టోబర్ 29: పెద్దపల్లి జిల్లా కన్నాల గ్రామానికి చెందిన భూమ్లానాయక్ తండా వాసి బాధవత్ తిరుపతికి చెందిన ఆవు గతంలో విద్యుత్ షాక్‌తో మృతి చెందింది. ఈ ఘటనలో నష్టపోయిన బాధితుడికి గౌరవ ఐటీ, పరిశ్రమల శాఖ మంత్రి దుద్దిళ్ల శ్రీధర్ బాబు చొరవతో రూ.40,000 పరిహారం అందించడం జరిగింది. బాధితుడికి ఆర్థిక సాయం అందేలా సహకరించిన భూమ్లానాయక్ తండా సర్పంచ్‌కు, విద్యుత్ శాఖ ఏఈకి బాధితుడు తిరుపతి ప్రత్యేక ధన్యవాదాలు తెలిపారు. తమకు అండగా నిలిచి పరిహారం అందేలా కృషి చేసిన మంత్రి శ్రీధర్ బాబుకు కృతజ్ఞతలు తెలియజేశారు.

రాజకీయాల కోసం మతాల మధ్య చిచ్చు పెట్టొద్దు..

భైంసా మాస్టర్ ప్లాన్‌పై కీలక వ్యాఖ్యలు



భైంసా : పట్టణ మాస్టర్ ప్లాన్‌పై చర్చించేందుకు హైదరాబాద్ టౌన్ ప్లానింగ్ అధికారులు, జిల్లా కలెక్టర్ భవేశ్ మిశ్రా సమక్షంలో బుధవారం సమావేశం నిర్వహించామని చైర్మన్ దత్తత్రి, వైస్ చైర్మన్ బిబి కుతిజా సిద్ధికి ఇద్రిస్ బేగ్ అన్నారు. ఈ సందర్భంగా వైస్ చైర్మన్ నివాసంలో గురువారం ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో వీరి ఇరువురు మాట్లాడుతూ... హిందూ--ముస్లింల మధ్య విభేదాలు సృష్టించేందుకు కొందరు ప్రతి దాంట్లో రాజకీయం చేస్తున్నారని,మాస్టర్ ప్లాన్ ద్వారా పట్టణానికి ప్రణాళికాబద్ధమైన అభివృద్ధి అందించాలన్నదే మా లక్ష్యమని పేర్కొన్నారు. గతంలో మాన్యువల్ విధానంలో అనుమతులు మంజూరు చేసే సమయంలో అక్రమాలకు పాల్పడుతూ లక్షలాది రూపాయలు వసూలు చేశారనే ఆరోపణలు ఉండగా...ఈ మాస్టర్ ప్లాన్ అమలుతో ఇలాంటి అక్రమాలకు అడ్డుకట్ట పడుతుందని అన్నారు. ఇలాంటివి జీర్ణించుకోలేక కావాలని ఉద్దేశంతో కొందరు దీనిని వ్యతిరేకిస్తున్నారని విమర్శించారు.పట్టణ అభివృద్ధిని దృష్టిలో ఉంచుకుని మాస్టర్ ప్లాన్‌పై ప్రజలు సానుకూలంగా ఆలోచించాలని, అధికారులపై వ్యక్తిగతంగా లేదా మతపరంగా ఆరోపణలు చేయకుండా సమస్యలను చర్చల ద్వారా పరిష్కరించుకోవాలని వారు ఈ సందర్భంగా సూచించారు.

Printed, Published and Ownedby **JADAV ROHIDAS,** and Printed at RATNA GRAPHICS Printing press (Name&Adress) 2-3-703/7,Tirumalanagar colony,amberpet,policeline,Hyderabad,Telangana-500013 Published from H.No 12-27 Village;FatkalMangi,Mandal;Lingapur, Kumrambheem Asifabad, Adilabad,Mancherial,TELANGANA-504293. **Editor: JADAV ROHIDAS.RNI NO:TGTEL/25/A0870, Email: jananinadam@gmail.com**.Phone no:9550100197